## 'ఎల్ నినో'తో సమగ్ర కార్యాచరణ ప్రణాళిక అమలు

**విద్యుత్, తాగునీటి సరఫరాపై నిరంతర పర్యవేక్షణ, కలెక్టర్ ఇలా త్రిపాఠి**




# ప్రజాపక్షం జిల్లా అనుబంధం

కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి

శుక్రవారం | 23 అక్టోబరు, 2026 | పేజీలు : 08


# ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా ప్రజాపక్షం దినపత్రిక

### సిపిఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా ప్రజాపక్షం దినపత్రిక ప్రజల అభిమానం చురగొంటుందని సిపిఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం అన్నారు. గురువారం రోజున స్థానిక ప్రజాపక్షం జిల్లా కార్యాలయంలో పత్రిక ఎనిమిదో వార్షికోత్సవం సందర్భంగా కేక్ కట్ చేసి పత్రికకు, పత్రిక యాజమాన్యానికి, విలేకరులకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల గొంతుక వినిపిస్తూ ప్రజల సమస్యల పట్ల తన వార్తా కథనాలతో ప్రభుత్వానికి తెలియపరుస్తూ ప్రజల సమస్యల పట్ల తన విధేయతను చాటుకుందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్టాఫ్ రిపోర్టర్ ఎండి గౌస్,రూరల్ రిపోర్టర్ ఎండి మాజీద్,టౌన్ రిపోర్టర్ బూస్ అనేవేని అశోక్ గౌడ్,సిపిఐ పట్టణ కార్యదర్శి నవీన్,తదితరులు పాల్గొన్నారు.




### కరీంనగర్‌లో ఘనంగా ప్రజాపక్షం 8వ వార్షికోత్సవ వేడుకలు

ప్రజాపక్షం దినపత్రిక 8వ వార్షికోత్సవ వేడుకలు కరీంనగర్‌లోని జిల్లా కార్యాలయంలో జిల్లా స్టాఫ్ రిపోర్టర్ చిప్పరి వెంకట రాజు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి, నగర సహాయ కార్యదర్శి పైడిపల్లి రాజు, కార్యాలయ కార్యదర్శి బి. సదాశివ, ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రజా పక్షం టౌన్ రిపోర్టర్ బి. సురేష్, రూరల్ రిపోర్టర్ వేణుమాదవ్, జిల్లా ఫోటో గ్రాఫర్ పిట్టల శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

### జగిత్యాలలో ఘనంగా వార్షికోత్సవ వేడుకలు



తెలుగు జాతీయ దినపత్రిక ప్రజా పక్షం ఎనిమిదవ వార్షికోత్సవ వేడుకలను గురువారం జగిత్యాల జిల్లా కేంద్ర ంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రజాప క్షం పత్రిక స్టాఫ్ రిపోర్టర్ బద్దేనపల్లి మల్లేశం ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు.అనంతరం ప్రజాప క్షం పత్రిక గత 8 సంవత్సరాలుగా ప్రజలకు,ప్రభుత్వాని కి మధ్య వారధిగా ఉంటూ ఎన్నో సంచలనాత్మకంగా అందించిన కథనాలను గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో మె ట్పల్లి రిపోర్టర్ బాసెట్టి హరీష్, సారంగాపూర్ రిపోర్టర్ కొ లపాక రాజు,జగిత్యాల టౌన్,రూరల్, ఫోటో గ్రాఫర్ పో సు మధుసూదన్,పిస్క సంపత్ కుమార్,ఎర్ర గంగా సాగ ర్,తదితరులు ఉన్నారు.

### వేములవాడలో ప్రజాపక్షం జాతీయ దినపత్రిక ఎనిమిదవ వార్షికోత్సవం

ప్రజాపక్షం జాతీయ దినపత్రిక ఎనిమిదవ వార్షికోత్సవం సందర్భంగా వేములవాడలో కేక్ కటింగ్ చేసిన రాజన్న సిరిసిల్ల జిల్లా స్టాఫ్ రిపోర్టర్ శ్రీనివాస్, వేములవాడ ఆర్సీ గొంగళ్ళ రవికుమార్, టౌన్ రిపోర్టర్ ఫహద్ పాషా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేములవాడ స్టాఫ్ రిపోర్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజా పక్షం పత్రిక యాజమాన్యానికి, పాఠకులకు, తోటి పాత్రికేయ మిత్రులకు 8వ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.



## ధర్మపురి బస్‌స్టాండ్ ఆధునీకరణకు రూ.2.5 కోట్లు

### ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్



**ప్రజాపక్షం/ధర్మపురి :** ధర్మపురి పట్టణంలోని బస్ స్టాండ్ అభివృద్ధిలో భాగంగా ఆధునీకరణ,మరమ్మతుల పనులకు రూ.2.5 కోట్ల నిధులు మంజూరు అయినట్లు రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్ తెలిపారు.దీనిలో భాగంగా ఈ నెల 25న రాష్ట్ర రవా ణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చేతులమీదుగా ఆధునీకరణ పనుల కు శంకుస్థాపన జరుగనున్నట్లు మంత్రి లక్ష్మ ణ్ కుమార్ పేర్కొన్నా రు.ఈ నేపథ్యంలో రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి గురువారం బస్ స్టాండ్‌ను సందర్శించి, ఆర్టీసీ అధికారులతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు,నాయకులతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. బస్ స్టాండ్‌లో చే పట్టనున్న ఆధునీకరణ పనులు, శంకుస్థాపన కార్యక్రమ ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు.ఈ సందర్భంగా మంత్రి లక్ష్మ ణ్ కుమార్ మా ట్లాడుతూ ప్రముఖ పుణ్యక్షేత్రమైన ధర్మపురిలో 2027 గోదావరి నది పు ష్కరాలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ముఖ్యమంత్రి రేవ ంత్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించిందని తెలిపా రు.ముఖ్యంగా పుష్కరాలకై తరలివచ్చే భక్తులకు అవసరమైన మౌలిక స దుపాయాల కల్పనలో భాగంగా రూ.రెండున్నర కోట్ల నిధులతో బ స్టాండ్ ఆధునీకరించనున్నట్లు చెప్పారు.బస్టాండ్‌లో యాత్రికులకు సరిప డా ఫ్లాట్‌ఫార్మ్‌లను విస్తరించడం, నూతన మరుగుదొడ్ల నిర్మాణం,త్రాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయడంతో కూడిన తదితర పనులకు ఈనెల 2 5న రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ చేతులమీదుగా శంకుస్థాపన జరుపనున్నట్లు మంత్రి అడ్లూరి తెలిపారు.గతంలో 10 ఏ ళ్ళు అధికారంలో ఉండి రాజ్యమేలిన బిఆర్ఎస్ నేతలు ఇక్కడి సమస్యల ను పట్టించుకోలేదని,మారుమూల గ్రామాలకు కనీసం బస్ సౌకర్యం కూడా ఏర్పాటు చేయకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోందని అన్నారు.ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తమ ప్రభుత్వం నూటికి నూరు శాతం అమలు చేస్తోందని మంత్రి అడ్లూరి పేర్కొన్నారు.25న బస్ స్టాండ్ ఆధునీకరణ ఫౌండేషన్‌కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లన్నీ సమన్వయంతో పూర్తి చేయాలని అధికారులకు మంత్రి సూచించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ వేముల నాగలక్ష్మి రాజేష్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎస్.దినేష్,దేవస్థానం మాజీ చైర్మన్ జక్కు రవీందర్,ఆర్‌టిసిఅధికారులు,మున్సిపల్ కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

## పేదల పక్షాన నిలిచి పోరాడిన ప్రజా నాయకుడు పండుగ సాయన్న



### కలెక్టర్ కోయ శ్రీహర్ష

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** పేద ప్రజల పక్షాన నిలిచి, అణగారిన వర్గాల కోసం పోరాడిన ప్రజా నాయకుడు పండుగ సాయన్న అని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు.గురువారం పండుగ సాయన్న జయంతి సందర్భంగా సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ నిజాం పాలన కాలంలో ప్రజలను దోపిడీ చేస్తున్న దొరలు, దేశ్‌ముఖ్‌లు, అధికారులు, సంపన్నులకు వ్యతిరేకంగా పండుగ సాయన్న పోరాటం చేశారని తెలిపారు. పేద ప్రజలకు అండగా నిలిచి, సంపన్నుల వద్ద ఉన్న ఆస్తులను పేదలకు పంచిపెట్టినందుకు ఆయన తెలంగాణ రాబిన్‌హుడ్‌గా ప్రసిద్ధి చెందారని పేర్కొన్నారు.ఆధిపత్య శక్తులైన దేశ్‌ముఖ్‌లు, కరణాలు, పటేళ్లు, భూస్వాముల కుట్రల కారణంగా పండుగ సాయన్న నిజాం ప్రభుత్వ హయాంలో హత్యకు గురయ్యారని ఆయన చరిత్రను స్మరించుకున్నారు. పండుగ సాయన్న వీరోచిత పోరాట గాథను నేటికీ దర్శనం మొగులయ్య వంటి జానపద గాయకులు 12 మెట్ల కిన్నెరపై ఆలపిస్తూ ప్రజలకు చేరవేస్తున్నారని తెలిపారు. ప్రజల కోసం పోరాడిన మహనీయుల చరిత్రను భావితరాలకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు.ఈ కార్యక్రమంలో డిఎస్‌సి డిఒ రవీందర్, జిల్లా సహకార అధికారి శ్రీ మాల,కలెక్టరేట్ ఏవో బండి ప్రకాష్,జిల్లా అధికారులు,సంబంధిత అధికారులు,బిసి సంఘాల నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్ జిల్లా బిజెపి నూతన కార్యవర్గం

**ప్రజాపక్షం/కరీంనగర్:** భారతీయ జనతా పార్టీ కరీంనగర్ జిల్లా శాఖ నూతన కార్యవర్గాన్ని ప్రకటించింది. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం గురువారం జిల్లా శాఖ కార్యవర్గ ప్రకటన విడుదల చేశారు. జిల్లా ఉపాధ్యక్షులు గా గుర్రాల వెంకట్ రెడ్డి, బింగి వేణు,ఎర్రబెల్లి సంపత్ రావు, దురిశెట్టి సంపత్, సిహెచ్. నరసింహరాజు గాజుల స్వప్న, జిల్లా ప్రధాన కార్యదర్శులు గా గుజ్జ శ్రీనివాస్ రావు, మాడ వెంకట్ రెడ్డి,కానుమల్ల గణపతి,జిల్లా కార్యదర్శులు గా గుంజేటి శివ కుమార్, కోల అశోక్, సంపెల్లి సంపత్ రావు, చేపురి సత్యం గౌడ్, ధాడి సునీత, రెడ్డవేని రాజు, జిల్లా కార్యాలయ కార్యదర్శి గా కాడార్ల విమల్ కుమార్, జిల్లా ఐటీ కన్వీనర్ అన్నాజి వినీత్ కుమార్, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ గొడుగు వినోద్ కుమార్ ల నియామకం జరిగింది. జిల్లాలో భారతీయ జనతా పార్టీ నీ క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడానికి, కేంద్రంలోని మోదీ ప్రభుత్వ విధానాలు, నిర్ణయాలను, అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకువెళ్లడానికి నూతన జిల్లా కార్య వర్గం తగిన కృషి చేయాలని జిల్లా అధ్యక్షులు సాయిని మల్లేశం సూచించారు.

# జిల్లా పోలీస్ కార్యాలయంలో సాయన్న జయంతి వేడుకలు



**ప్రజాపక్షం / రాజన్న సిరిసిల్ల :** పండుగ సాయన్న ముదిరాజ్ జయంతి వేడుకలను జిల్లా పోలీస్ కార్యాలయంలో గురువారం రోజున ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పండుగ సాయన్న ముదిరాజ్ చిత్రపటానికి జిల్లా ఎస్పీ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ పండుగ సాయన్న అందించిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో సిఐ రవి, ఆర్ఐ రమేశ్, ఎస్సై కిరణ్, ఆర్ఎస్సై శ్రీనివాస్, పోలీస్ సిబ్బంది, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# అంబరాన్నంటిన బతుకమ్మ సంబరాలు



**ప్రజాపక్షం /మల్లాపూర్ :** తెలంగాణ ఆడపడుచులు అత్యంత ప్రతిష్టాత్మకంగా జరుపుకునే బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి. తొమ్మిది రోజులపాటు ఆటపాటలతో బతుకమ్మ వేడుకలు జరుపుకొని గురువారం రోజున తీరక్క పూలతో బతుకమ్మలను పేర్చి కోలాటాలతో నృత్యాలు చేస్తూ పోయిరా బతుకమ్మ అంటూ ఘనంగా వీడ్కోలు పలికారు.ఈ కార్యక్రమాలలో మహిళలు,చిన్నారులు పాల్గొన్నారు.

# ఆదివాసీల హక్కుల కోసం పోరాడిన యోధుడు కొమురం భీమ్

## బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, నాస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్ రావు




**ప్రజాపక్షం / రాజన్న సిరిసిల్ల :** జల్, జంగిల్, జమీన్ నినాదంతో ఆదివాసీల హక్కుల కోసం పోరాడిన యోధుడు కొమురం భీమ్ జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య అన్నారు. గురువారం సిరిసిల్ల బిఆర్ఎస్ భవన్‌లో కొమురం భీమ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య, నాస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్ రావులు మాట్లాడుతూ కొమురం భీమ్ త్యాగం, ధైర్యం, పోరాట స్ఫూర్తి చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఆయన ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు బూర బాలు, మొగిలి నాగరాజు, ఎల్లారెడ్డిపేట మండల సెస్ డైరెక్టర్ వర్స కృష్ణహరి, ఫ్యాక్స్ చైర్మన్ గుండారపు కృష్ణరెడ్డి, మాజీ సెస్ డైరెక్టర్ కుంబాల మల్లారెడ్డి, తంగళ్లపల్లి మండల అధ్యక్షులు గజబీంకర్ రాజన్న, మాజీ ఎంపిపి చంద్రయ్య గౌడ్, అమర్ రావు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# సహకార సంఘం ఆధ్వర్యంలో రైతులకు మరిన్ని సేవలు

## జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ అధికారుల తనిఖీ

**ప్రజాపక్షం/సుల్తానాబాద్ :** చిన్న కాలువల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో రైతులకు రానున్న రోజుల్లో మరిన్ని ఉన్నత సేవలను అందించిన ఉన్నట్లు సహకార సంఘం అధ్యక్షులు మురళీధర్ రావు అన్నారు.జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ ఆధ్వర్యంలో చిన్న కల్వల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం(ప్యాక్స్)ను జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ అధికారుల బృందం శుక్రవారం తనిఖీ నిర్వహించారు.అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఆధ్వర్యంలో అధికారులు సంఘం నిర్వహిస్తున్న వివిధ వ్యాపార కార్యకలాపాలు,సభ్యులకు అందిస్తున్న రుణ సేవలు,ఆర్థిక నిర్వహణను పరిశీలించారు.ఈ సందర్భంగా ప్యాక్స్ డెవలప్మెంట్ రిసోర్స్ పర్సన్ సత్యనారాయణ, కార్యదర్శి వల్లకొండ రమేష్ సంఘం కార్యకలాపాలపై అధికారులకు వివరించారు. సంఘం ద్వారా రైతులకు అందిస్తున్న పంట రుణాలు, దీర్ఘకాలిక రుణాలు, చిరు వ్యాపారస్తులకు రుణాలు, పురుగుమందులు, ఎరువుల సరఫరా, గోదాముల నిర్వహణ, పెట్రోల్ బంక్ కార్యకలాపాలు, ఎన్‌పీఏ స్థితి, రుణాల వసూళ్ల శాతం, వరి ధాన్యం కొనుగోలు నిర్వహణ తదితర అంశాలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి సంఘం పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు గౌరవెల్లి మురళీధర్ రావు మాట్లాడుతూ, రానున్న రోజుల్లో జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ కరీంనగర్ సహకారంతో సభ్యులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు ఫంక్షన్ హాల్ నిర్మాణం,గోల్డ్ లోన్ సేవలను ప్రారంభించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు.

# కళా సమితి స్థలం పరిరక్షణకు పోస్టుకార్డు ఉద్యమం

## అధికారులు, ప్రజాప్రతినిధులకు విజ్ఞప్తి



**ప్రజాపక్షం/ మెట్‌పల్లి :** మెట్‌పల్లిలో లలిత కళా సమితి స్థలాన్ని కాపాడాలని కోరుతూ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన పోస్టుకార్డు ఉద్యమాన్ని గురువారం కొనసాగించారు.చావిడి చౌరస్తా సమీపంలోని ప్రధాన తపాలా కార్యాలయంలో జిల్లా కలెక్టర్, ఎస్పీ, ఇతర అధికారులు,ప్రజాప్రతినిధులకు పోస్టుకార్డులు పంపినట్లు సమితి ప్రతినిధులు తెలిపారు.సమితి స్థలం ఆక్రమణకు గురైందని ఆరోపిస్తూ అధికారులు స్పందించి విచారణ చేపట్టాలని,ఆక్రమణలు నిర్ధారణ అయితే చట్టపరమైన చర్యలు తీసుకొని స్థలాన్ని పరిరక్షించాలని కోరారు.పాత తాలూకా ప్రాంత కళాకారులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ మట్టెల గంగాధర్,ప్రధాన కార్యదర్శి కోటగిరి చైతన్య,సహాయ కార్యదర్శి డీఎల్ఎన్ వర్మ, క్రాంతికుమార్,రాజగంగారాం,పాత కళాకారుల ఐక్య వేదిక సభ్యులు రాజారం,గణేష్,తదితరులు పాల్గొన్నారు.

# తక్కువ నీటితో కూరగాయల సాగును ప్రోత్సహిద్దాం

## జిల్లా ఉద్యాన అధికారి గడ్డం శ్యాంప్రసాద్



**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్:** ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో రైతులు అందుబాటులో ఉన్న కొద్దిపాటి నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకుంటూ, తక్కువ నీటితో సాగయ్యే కూరగాయల పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలని పెద్దపల్లి జిల్లా ఉద్యాన మరియు పట్టు పరిశ్రమ అధికారి గడ్డం శ్యాంప్రసాద్ రైతులకు సూచించారు.రాబోయే రోజుల్లో వర్షాభావ పరిస్థితులు మరింత తీవ్రతరం అయ్యే అవకాశం ఉన్నందున రైతులు ముందస్తు ప్రణాళికతో పంటలను ఎంపిక చేసుకోవాలని తెలిపారు. ముఖ్యంగా అధిక నీటి అవసరం ఉన్న పంటలకు బదులుగా బెండ,అలసంద,గోరుచిక్కుడు,వంగ, మునగ, చిలగడదుంపతో పాటు అధిక ఉష్ణోగ్రతలను తట్టుకోగల సాహూ వంటి టమాటా రకాలను స్థానిక పరిస్థితులకు అనుగుణంగా సాగు చేయాలని సూచించారు.ప్రతి నీటి చుక్కను ఒడిసిపట్టి పంటను కాపాడుకోవడమే ప్రస్తుత పరిస్థితుల్లో రైతుల ప్రధాన లక్ష్యం కావాలని పేర్కొన్నారు.కూరగాయల సాగులో నేల నుంచి నీటి ఆవిరి నష్టాన్ని తగ్గించేందుకు మల్చింగ్ షీట్లను తప్పనిసరిగా వినియోగించాలని, తద్వారా నేలలో తేమను ఎక్కువకాలం నిలుపుకోవడంతో పాటు కలుపు మొక్కల పెరుగుదలను కూడా నియంత్రించవచ్చని వివరించారు.నీటి లభ్యతను బట్టి పంట విస్తీర్ణాన్ని నిర్ణయించుకోవాలని, నేలలో తేమను నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన మేరకే నీటిని అందించాలని తెలిపారు.అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగిస్తూ, సరైన పంటలను ఎంచుకుంటే వర్షాభావ పరిస్థితుల్లోనూ రైతులు ఆదాయం పొందే అవకాశం ఉంటుంది అని శ్యాంప్రసాద్ పేర్కొన్నారు.ఎల్‌నినో పరిస్థితులను ఎదుర్కొనేందుకు రైతులు సంప్రదాయ సాగు విధానాలకు బదులుగా నీటి పొదుపు సాంకేతికతలను అవలంబించాలని, పంటల ఎంపిక మరియు సాగు యాజమాన్యంపై అవసరమైన సాంకేతిక సలహాల కోసం సమీప ఉద్యానవన అధికారులను సంప్రదించాలని కోరారు.

# అధిక ఫీజు వసూలు చేస్తే గుర్తింపు రద్దు చేయాలి

## తెలంగాణా విద్యార్థి సేన డిమాండ్

**ప్రజాపక్షం/కరీంనగర్ :** విద్యార్థుల నుంచి అధిక ఫీజులు వసూలు చేసే కార్పోరేట్ పాఠశాలు, కళాశాలల గుర్తింపు రద్దు చేయాలని తెలంగాణ విద్యార్థి సేన వ్యవస్థాపక అధ్యక్షుడు పడాల రవిందర్ గౌడ్ డిమాండ్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా వేర్వేరు పేర్లతో ఫీజులను వసూలు చేయడమే కాకుండా విద్యార్థులను ఇబ్బందికి గురి చేయడం నేరమని, అలాంటి యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని తెలంగాణ విద్యార్థి సేన డిమాండ్ చేస్తుందని తెలిపారు. పలు కాలేజీలు, కార్పోరేట్ పాఠశాలలు ట్యూషన్ ఫీజు పెంచేసి , ఇతరేతర పేర్లతో అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని , కొన్ని కాలేజీలు ఫీజు బకాయి పేరిట సర్టిఫికేట్ ఇవ్వకపోవడం నేరమని, అలాంటి కాలేజీ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల నుంచి వసూలు చేసిన అధిక ఫీజులు వెనక్కి తిరిగి ఇవ్వని పాఠశాలలు మరియు కళాశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ విద్యార్థి సేన డిమాండ్ చేస్తుందని తెలిపారు.ఐఐటి, నీట్, జెఇఇఅంటూ తప్పుడు ప్రకటనలతో కాలేజీలు తల్లిదండ్రులను మోసం చేస్తున్నారని ఆయన తెలిపారు. అధిక ఫీజులు వసూలు చేస్తున్న కార్పోరేట్ పాఠశాలు, కళాశాలలను ఆకస్మిక తనిఖీలు చేయాలని కోరారు.

# ఊపందుకున్న వరి పంటల కోతలు



**ప్రజాపక్షం/ముత్తారం :** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండల పరిధిలోని పలు గ్రామాల్లో వరి కోతలు తీవ్రంగా ఊపందుకున్నాయి. ఈ ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రైతులు సాగు చేసిన వరి పంటలు ప్రస్తుతం కోత దశకు చేరుకోవడంతో, వ్యవసాయ పనులు జోరందుకున్నాయి.మండలంలోని దాదాపు అన్ని గ్రామాల్లోనూ రైతులు ఉదయం నుంచే వరి కోత మిషన్లతో పాటు కూలీలతో వరి కోతలు కోయిస్తూ బిజీగా గడుపుతున్నారు.ఈ ఏడాది సకాలంలో వర్షాలు కురవడం,నీటి లభ్యత సానుకూలంగా ఉండటంతో పంట దిగుబడిపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.కోతలు ఒకేసారి ప్రారంభం కావడంతో ముత్తారం పరిసర గ్రామాల్లో వ్యవసాయ క్షేత్రాలన్నీ కోలాహలంగా మారాయి.

# క్రికెట్ టోర్నమెంట్ విజేత మల్లేష్ టీమ్




**ప్రజాపక్షం/ధర్మపురి :** ధర్మపురి పట్టణంలో మల్లేశ్, అఖిల్ ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్–2026 దసరా ఎడిషన్ ఫైనల్ మ్యాచ్ విజేతలకు మున్సిపల్ చైర్‌పర్సన్ వేముల నాగలక్ష్మి ట్రోఫీలు అందజేశారు.గురువారం జరిగిన టోర్నమెంట్ ఫైనల్ మ్యాచులో బి.మల్లేశ్‌కు చెందిన యూ.ఆర్.కింగ్స్ జట్టు విజేతగా నిలవగా,విక్కీకి చెందిన ఎకె47 విక్టోరియస్ జట్టు రన్నరప్‌గా నిలిచింది.ఇరు జట్ల ఆటగాళ్లకు చైర్‌పర్సన్ ట్రోఫీలు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వేముల రాజేష్,జక్కు రవీందర్, ఎల్లాల శ్రీకాంత్ రెడ్డి,గాజు సాగర్,గుడ్ల రవీందర్, కొమురయ్య,స్పాన్సర్లు,క్రీడాభిమానులు పాల్గొన్నారు.

# కొమరం భీం జయంతి వేడుకలు

**ప్రజాపక్షం/లోకేశ్వరం :** లోకేశ్వరం మండలంలోని మండల వ్యాప్తంగా కొమరం భీం జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.కొమురం భీమ్ జయంతి వేడుకలను మండలంలోని ఆయా గ్రామాల న్యాయ క్ పోడ్ సంఘ సభ్యులు గ్రామస్తులు నాయకులు పాల్గొని విగ్రహాల వద్ద నివాళులు అర్పించి ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా పలువురు పెద్దలు మాట్లాడుతూ కొమరం భీమ్ జల్ జంగల్ జమీన్ నినాదంతో,నిజాములను వనికించారని,ఆదివాసి హక్కుల కోసం పోరాటాలు చేశారని తెలంగాణ కోసం అహర్నిశలు పోరాటం చేశారని తాను చేసిన మరిన్ని సేవలను కొనియాడారు.అలాగే లోకేశ్వరం మండల కేంద్రంలో కొమరం భీం విగ్రహానికి నివాళులు అర్పించి వారు చేసిన త్యాగాలను స్మరించుకున్నారు.

# రామగుండంలో మూడేళ్లుగా రౌడీ పాలన



## ప్రజలకు కన్నీళ్లు, దేవుళ్లకు అవమానాలా?

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** మతిలేని నాయకుడిని ఎన్నుకున్న పాపానికి రామగుండం ప్రజలు అనుభవిస్తున్న కష్టాలకు నిలువెత్తు నిదర్శనమే ఈ మూడేళ్ల పాలననీ, మొదటి నుంచి చెబుతున్నదే నేడు జరుగుతోందని, అభివృద్ధి పేరుతో కూల్చివేతలు, బాధిత కుటుంబాల కన్నీళ్లు,ప్రజల ఆవేదన మధ్య అసలు అభివృద్ధి ఎక్కడుందని బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు వ్యాల్లహరీష్ రెడ్డి ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్‌ను ప్రశ్నించారు.గురువారం రోజున ఆయన పత్రిక విలేకరులతో మాట్లాడుతూ అభివృద్ధి పేరుతో ఇళ్లు కోల్పోయిన బాధితుల కుటుంబాలు నేటికీ ఎన్ని ఇబ్బందులు పడుతున్నాయని, వారి కన్నీళ్లకు ఎవరు సమాధానం చెబుతారని, మార్కండేయ కాలనీలో విలాసవంతమైన భవనాలు,అక్రమ ఆస్తులపై వస్తున్న ఆరోపణలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత పాలకులపై లేదా అని, పేదల ఇళ్లు కూల్చే అధికారానికి,వారి జీవితాలను మళ్లీ నిలబెట్టే బాధ్యత కూడా ఉండాలని,50 ఏళ్లకు పైగా చరిత్రలో ఎన్నడూ లేని విధంగా మైసమ్మ ఆలయాల కూల్చివేతలపై వివాదం,వినాయక విగ్రహాల నిమజ్జనానికి సరైన నీటి ఏర్పాట్లు చేయలేదన్న విమర్శలు, తాజాగా దుర్గామాత విగ్రహాల నిమజ్జనానికి మురికికుంటలను సూచించారన్న ఆరోపణలు,ఇదేనా హిందూ ధర్మానికి ఇచ్చే గౌరవం? ఇదేనా ప్రజాప్రతినిధిగా మీ బాధ్యత? దేవతల విగ్రహాల నిమజ్జనానికి గౌరవప్రదమైన ఏర్పాట్లు చేయలేని పాలన ఎందుకు అని, విశ్వహిందూ పరిషత్ నిరసన చేపట్టిన తర్వాతే నిమజ్జన ఏర్పాట్లపై స్పందించాల్సిన పరిస్థితి ఎందుకొచ్చిందని,ముందే అధికారులు,ప్రజాప్రతినిధులు మేల్కొని ఉంటే ఈ వివాదాలకు తావుండేదా అని ప్రశ్నించారు.రామగుండంలో వ్యాపారాలు,ప్రజల జీవన పరిస్థితులు, బాధితుల సమస్యలపై పాలకులు సమాధానం చెప్పాలని, ప్రజలు భయపడకుండా, వ్యాపారులు స్వేచ్ఛగా, సామాన్యులు ప్రశాంతంగా జీవించే వాతావరణం కల్పించాలని, ప్రతిపక్షం ప్రశ్నిస్తే సమాధానం చెప్పాలని ప్రజల ఆవేదనను అణచివేయాలని చూడకూడదని హితవు పలికారు.అధికారం శాశ్వతం కాదని, పదవులు శాశ్వతం కాదని, ప్రజల తీర్పే అంతిమమని, రామగుండం ప్రజలకు కావాల్సింది రౌడీ రాజకీయాలనే విమర్శలకు తావిచ్చే పాలన కాదని,అభివృద్ధి, ఆత్మగౌరవం, ధార్మిక స్వేచ్ఛ, ప్రశాంతమైన జీవనం అవసరమని, ప్రజల కన్నీళ్లకు, దేవతల నిమజ్జన వివాదాలకు ఎప్పుడు సమాధానం చెబుతారని, మొదటి నుండి చెప్తూ వస్తున్న మాట నిజం చేస్తు టూరిస్ట్ ఎమ్మెల్యే నియోజకవర్గంలో ఉండి ప్రజల సమస్యలను తీర్చేది ఎప్పుడు అని ఎమ్మెల్యే ను సూటిగా ప్రశ్నించారు.రామగుండం ప్రజలకు కావాల్సింది మాటల పాలన కాదని,చేతల పాలనని అన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

**ప్రజాపక్షం/సుల్తానాబాద్ :** సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఆసుపత్రిలోని వివిధ విభాగాలను పరిశీలించిన ఆయన, రోగులకు అందుతున్న వైద్య సేవలు,ఔట్‌పేషెంట్ సేవలు, మందుల నిల్వలు, వైద్య పరీక్షల నిర్వహణ, ఆసుపత్రి పరిశుభ్రతపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రతి రోగికి నాణ్యమైన వైద్య సేవలు అందేలా వైద్యాధికారులు, సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. వైద్యులు,సిబ్బంది సమయపాలన పాటిస్తూ విధులకు హాజరుకావాలని,రోగులు ఎక్కువసేపు నిరీక్షించకుండా ఓపీ సేవలను సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు.ఆసుపత్రి ఆవరణ, వార్డులు, పరీక్షల గదులు,రోగుల వేచిచూసే ప్రదేశాలను పరిశుభ్రంగా ఉంచాలని,తాగునీరు,పారిశుద్ధ్యం,ఇతర కనీస సౌకర్యాల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. వైద్య వ్యర్థాలను నిబంధనల మేరకు సురక్షితంగా తొలగించాలని సూచించారు.రోగులు,వారి కుటుంబ సభ్యులతో వైద్యులు, సిబ్బంది మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, వారి సమస్యలను ఓపికగా విని అవసరమైన సమాచారం అందించాలని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల్లో విశ్వాసం పెరిగేలా వైద్య సేవల నాణ్యతను మరింత మెరుగుపరచాలని,సేవల్లో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేసారు.

## ప్రజా వీరుడు పండుగ సాయన్న

### జగిత్యాల కలెక్టరేట్‌లో ఘనంగా పండుగ సాయన్న జయంతి వేడుకలు



**ప్రజాపక్షం/జగిత్యాల టౌన్ :** నిజాం నిరంకుశత్వానికి,భూస్వామ్య వ్యవస్థ దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పోరాడి,ఆకలితో అలమటించే నిరుపేదల కడుపు నింపిన బహుజన వీరుడు ప్రజా వీరుడు,తెలంగాణ రాబిన్ హుడ్ పండగ సాయన్న జయంతి ఉత్సవాలను గురువారం జిల్లా కలెక్టరేట్ లో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ హాజరై పండుగ సాయన్న చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా వీరుడు, తెలంగాణ రాబిన్ హుడ్‌గా పిలవబడే పండుగ సాయన్న తెలంగాణ ప్రాంత వాసిగా మహబూబ్ నగర్ జిల్లాలో పుట్టిన పండుగ సాయన్న నిజాం పాలనపై అలుపెరుగని పోరాటం చేశాడని ఆయన చిన్నప్పటి నుండే పెట్టుబడిదారీ వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడిన గొప్ప మహనీయుడని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బిసి వెల్ఫేర్ అధికారి జయరాజ్, కలెక్టరేట్ ఎఒ కిషన్, సిబ్బంది,బిసి సంఘాల నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

## ఉరి వేసుకొని వివాహిత ఆత్మహత్య

### కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన ఎస్ఐ కృష్ణ సాగర్ రెడ్డి



**ప్రజాపక్షం/గొల్లపల్లి :** జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం వెనుగుమట్ల గ్రామంలో వివాహిత ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై కృష్ణ సాగర్ రెడ్డి తెలిపారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వెనుగుమట్ల గ్రామానికి చెందిన సబ్బనేవేని మానస అలియాస్ కేతనవేని గాయత్రి (28)కి అదే గ్రామానికి చెందిన తిరుపతి అనే వ్యక్తితో కొన్నేళ్ల క్రితం వివాహమైంది. పెళ్లయినప్పటి నుంచి ఈ దంపతులు హైదరాబాద్‌లోనే నివాసం ఉంటున్నారు.ఇటీవల దసరా పండుగను పురస్కరించుకుని ఈ దంపతులు తమ స్వగ్రామమైన వెనుగుమట్లకు వచ్చారు.అయితే మృతురాలికి గత మూడేళ్లుగా మానసిక ఆరోగ్య సమస్యలు ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.దీని కోసం ఆమెకు హైదరాబాద్,ముంబై నగరాల్లోని ఆసుపత్రుల్లో వైద్యం కూడా చేయించారు.ఈ క్రమంలో మానసిక స్థితి సరిగ్గా లేని గాయత్రి గురువారం మధ్యాహ్నం సుమారు 3 గంటల సమయంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది.మృతురాలి తండ్రి సబ్బనేవేని లింగయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై ఎం. కృష్ణసాగర్ రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## ఆర్జీ వన్‌లో జరిగిన ప్రమాదాల్లో గాయపడిన కార్మికులు

**ప్రజాపక్షం/పెద్దపల్లి:** సింగరేణి ఆర్జీ వన్ ఏరియా లోని జిడికె వన్ ఇంక్లైన్ లో జనరల్ అసిస్టెంట్ ట్రేని గా విధులు నిర్వహిస్తున్న అన్వికేత్ షీల్ మరియు జిడికె 2.ఇంక్లయిన్ లో జనరల్ అసిస్టెంట్ గా పని చేస్తున్న ఒద్ది శ్రీనివాస్ అనే ఇరువురు కార్మికులు గురువారం విధి నిర్వహణలో ప్రమాదం జరుగగా,వారిని చికిత్స కోసం గోదావరిఖని సింగరేణి హాస్పిటల్ కు పంపగా, విషయం తెలిసి సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్ హాస్పిటల్ కు వెళ్లి కార్మికులను పరామర్శించి,జరిగిన ప్రమాదం వివరాలు తెలుసుకుని,మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్ లను కోరగా, డాక్టర్ లు వారిని హైదరాబాద్ హాస్పిటల్ కు తరలించారు. పరామర్శించిన వారిలో ఏఐటియుసి ఆర్జీ వన్ బ్రాంచి కార్యదర్శి రంగు శ్రీను, బ్రాంచి సహాయ కార్యదర్శి మాదన మహేష్, ఫిట్ కార్యదర్శులు మానాల శ్రీనివాస్,పొన్నాల వెంకటయ్య,సహాయ కార్యదర్శి ఉప్పులేటి తిరుపతి,నాయకులు కెక్కర్ల ప్రశాంత్,పైడిపల్లి శ్రీనివాస్,తదితరులు ఉన్నారు.

## సింహ గర్జన విజయవంతమైనందుకు కెటిఆర్‌కు శుభాకాంక్షలు

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్:** ఇటీవల గోదావరిఖనిలో నిర్వహించిన బిఆర్ఎస్ పార్టీ సింగరేణి సింహ గర్జన కార్యక్రమం విజయవంతమైన సందర్భంగా పెద్దపల్లి మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ దాసరి మమతా రెడ్డి,దాసరి ప్రశాంత్ రెడ్డి బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీ కల్వకుంట్ల తారక రామారావు (కెటిఆర్) ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా కెటిఆర్ సింగరేణి సింహ గర్జన సభ విజయవంతంలో భాగస్వాములైన దాసరి ప్రశాంత్ రెడ్డి లను ప్రత్యేకంగా అభినందించారు.అదేవిధంగా పెద్దపల్లి నియోజకవర్గానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సభ విజయవంతానికి చేసిన కృషిని ప్రశంసించారు. పార్టీ కార్యక్రమాలను విజయవంతం చేయడంలో నాయకులు,కార్యకర్తలు చూపిన ఐక్యత,నిబద్ధత అభినందనీయమని పేర్కొన్నారు.

## తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ

**ప్రజాపక్షం/సారంగాపూర్:** జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలం పెంబట్ల గ్రామంలో గురువారం సద్దుల బతుకమ్మ పండుగ ఘనంగా నిర్వహించినట్లు సర్పంచ్ కొలపాక రాధ రాజు అన్నారు. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ మహిళల ఆనందోత్సాహాల మధ్య ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంది. ప్రకృతిని ఆరాధిస్తూ, పూలను దేవతగా భావించి జరుపుకునే ఈ పండుగ తెలంగాణ ఆడపడచుల ఆత్మీయతకు, ఐక్యతకు నిదర్శనంగా నిలుస్తుంది. ప్రతి ఏడాది ఆశ్వయుజ మాసంలో తొమ్మిది రోజుల పాటు బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహిస్తారు. ఈ సంవత్సరం పాలకవర్గం సహకారంతో ప్రత్యేకంగా లైట్లు ఏర్పాటు చేయడం జరిగిందని, సాయంత్రం వేళల్లో ధగధగ మెరిసే కాంతుల్లో గ్రామంలోని కూడళ్లలో ఒక చోట చేరి బతుకమ్మల చుట్టు వలయంగా నిలబడి సంప్రదాయ పాటలు పాడుతూ కోలాటాలతో సందడి చేస్తారు.మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి, అందంగా అలంకరించిన బతుకమ్మలను ఊరేగింపుగా తీసుకెళ్లి శ్రీ దుబ్బ రాజేశ్వర స్వామి దేవస్థానం నందు స్వామివారిని దర్శించుకుని స్వామి వారి కోనేరులో నిమజ్జనం చేస్తారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో వి. అనూష, ఎస్ఐ గీత, ఉప సర్పంచ్ ప్రభాకర్, వార్డు సభ్యులు లక్ష్మణ్, విజయ, జ్యోతి రెడ్డి, చిరంజీవి, లచ్చం, మల్లయ్య, లక్ష్మి, రాజేష్, గంగు, సింగిల్ విండో చైర్మన్ మల్లారెడ్డి, పంచాయతీ కార్యదర్శి తిరుపతి, నాయకులు సర్పంచ్ రాజన్న, రాజు, బాదినేని రవి, ముండ్ల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## యాసంగిలో 'వరి'కి బదులుగా ఆరుతడి పంటలతోనే లాభం?

### మండల వ్యవసాయ శాఖ అధికారిణి పైడితల్లి



**ప్రజాపక్షం/సుల్తానాబాద్ :** ప్రస్తుత ఎల్ నినో పరిస్థితుల ప్రభావంతో వర్షపాతం తగ్గడం, భూగర్భ జలమట్టాలు క్షీణించడం వంటి పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రాబోయే యాసంగి (రబీ) సీజన్‌లో నీటి వినియోగం అధికంగా ఉండే వరి పంట సాగును సాధ్యమైనంతవరకు నివారించాలని వ్యవసాయ శాఖ మండల అధికారిణి పైడితల్లి రైతులకు సుహించారు. అందుబాటులో ఉన్న నీటి వనరులను బట్టి తక్కువ నీటితో సాగయ్యే ఆరుతడి పంటలను ఎంచుకోవడం ద్వారా సాగు వ్యయం తగ్గించడంతో పాటు మంచి ఆదాయం పొందవచ్చని అధికారులు పేర్కొన్నారు.వ్యవసాయ శాఖ సూచనల ప్రకారం నువ్వులు,పెసర,మినుము, పొద్దుతిరుగుడు,వేరుశనగ, శనగ,జొన్న,మొక్కజొన్న వంటి పంటలు యాసంగికి అనుకూలమైన ప్రత్యామ్నాయ పంటలుగా గుర్తించబడ్డాయి.వీటికి కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధరలు (ఎంఎస్పీ) కూడా రైతులకు లాభదాయకంగా ఉండనున్నాయి.నువ్వులు అత్యధిక మద్దతు ధర కలిగిన పంటగా నిలుస్తుండగా,పెసర, మినుము వంటి పప్పు ధాన్యాలు నేల సారాన్ని పెంచడంలో ఉపయోగపడతాయి. వేరుశనగ,పొద్దుతిరుగుడు వంటి పంటలు తక్కువ నీటితో మంచి దిగుబడిని అందించే అవకాశముందని వ్యవసాయ అధికారులు తెలిపారు. జొన్న, మొక్కజొన్న వంటి తృణధాన్యాలు కూడా నీటి కొరత పరిస్థితుల్లో అనుకూలమైన ప్రత్యామ్నాయాలుగా సూచించారు.నీటిని ఆదా చేయడానికి మొక్కజొన్న, జొన్న పంటల్లో జోడు సాలు పద్ధతి పాటించాలని అధికారులు సూచించారు. ఈ విధానంలో 30 నుంచి 35 శాతం వరకు నీటి ఆదా సాధ్యమవుతుందని, ఖాళీ ప్రదేశాల్లో పెసర, మినుము,నువ్వులు వంటి అంతర పంటలు వేసి అదనపు ఆదాయం పొందవచ్చని తెలిపారు.యాసంగిలో వరి సాగు చేయని వరి పొలాల్లో జీరో టిల్లేజ్ (దున్నకుండా సాగు) విధానాన్ని అనుసరించడం ద్వారా దుక్కి దున్నడం, గట్లు వేయడం వంటి పనులు అవసరం లేకుండా ఎకరానికి రూ.4,000 నుంచి రూ.5,000 వరకు ఖర్చు తగ్గించుకోవచ్చని వ్యవసాయ శాఖ వెల్లడించింది. అలాగే నేలలో సహజ తేమ ఎక్కువకాలం నిల్వ ఉండటంతో ప్రారంభ దశలో నీటి అవసరం కూడా తగ్గుతుందని పేర్కొంది.పప్పుధాన్యాల విత్తనాలకు రైజోబియం సంస్కృతితో విత్తన శుద్ధి చేయడం వల్ల నత్రజని స్థిరీకరణ జరిగి ఎరువుల ఖర్చు తగ్గుతుందని అధికారులు సూచించారు. వేరుశనగలో 40 నుంచి 45 రోజుల దశలో జిప్సం వినియోగించడం వల్ల గింజల నాణ్యత మెరుగుపడుతుందని తెలిపారు.మొక్కజొన్నలో కత్తెర పురుగు నివారణకు ఎమామెక్టిన్ బెంజోయేట్ మందును సిఫారసు చేసిన మోతాదులో పిచికారీ చేయాలని, పొద్దుతిరుగుడు పంటలో పూత దశలో బోరాన్ పిచికారీ చేయడం ద్వారా గింజల నాణ్యత పెరుగుతుందని వ్యవసాయ నిపుణులు వివరించారు.నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని పంటల ఎంపిక, ఆధునిక సాగు పద్ధతుల అమలు,సకాలంలో పంట సంరక్షణ చర్యలు చేపట్టడం ద్వారా ఎల్ నినో ప్రభావం ఉన్న యాసంగి సీజన్‌లో కూడా రైతులు పెట్టుబడి నష్టాలను తగ్గించుకుని లాభదాయకమైన సాగు కొనసాగించవచ్చని వ్యవసాయ శాఖ సూచించింది.

# జాతీయ వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు విజ్ఞత ఎంపిక

ఒకెఆర్ ఫౌండేషన్ ఆర్థిక సహాయం



**ప్రజా పక్షం /ఖానాపూర్ :** హైదరాబాద్ లోని హకీంపేటలో నిర్వహించిన 70వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ 2026–27 రాష్ట్ర స్థాయి వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో ఖానాపూర్ కి చెందిన రాగం విజ్ఞత బంగారు పతకం సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. జాతీయ స్థాయిలో పోటీలలో పాల్గొనేందుకు, శిక్షణ కోసం 5,000 రూపాయల ఆర్థిక సహాయాన్ని ఓకేఆర్ ఫౌండేషన్ ద్వారా అందించడం జరిగింది.రాష్ట్రస్థాయిలో సత్తా చాటి జాతీయస్థాయికి ఎంపికైన విజ్ఞతను ఓకేఆర్ ఫౌండేషన్ సభ్యులు అభినందించి, జాతీయస్థాయిలో కూడా విజయం సాధించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఓకే ఆర్ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## ఉచిత కంటి చికిత్స శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి



**ప్రజాపక్షం/బోథ్ :** బోథ్ మండలం లోని పట్నాపూర్ గ్రామం లో న్యాయవాది పంద్రం శంకర్ ఆధ్వర్యంలో ఉచిత కంటి చికిత్స శిబిరం యొక్క వాలు పోస్టర్లనుగురువారం ఆవిష్కరించారు.ఈ సందర్బంగా న్యాయవాది పంద్రం శంకర్ మాట్లాడుతు వానవాసి కళ్యాణ్ పరిషత్ తెలంగాణ వారి ఆధ్వర్యంలో తేది అక్టోబర్ 24 నుండి 31 వరకు ఇంద్రవెల్లి మండల కేంద్రం లో నిర్వహించే ఉచిత కంటిచికిత్సశిభిరన్నిసద్వినియోగం చేసుకోవాలని గ్రామ ప్రజలందరికి పిలుపునిచ్చారు. ప్రపంచం లోనే అత్యుత్తమ శంకర నేత్ర చికిత్సలయం చెన్నై వారి సౌజన్యంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారని తెలియచేశారు.ఈ కార్యక్రమంలొ కరాత్వడా సర్పంచ్ దుర్వ విశ్వేశ్వర్ రావ్,మండల ప్రముఖ్ కనక అమృత్ రావు,పట్నాపూర్ ఉప సర్పంచ్ ఆత్రం మోహన్,మాజీ సర్పంచ్ తోడషం గోపాల్,వార్డు మెంబర్స్ తోడషం అనిల్ కుమార్,ఆత్రం దేవురావు,మాడవి కృష్ణ,గోడం పురుషోత్తం పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి పరామర్శ

**ప్రజాపక్షం/లోకేశ్వరం :** అవర్గ గ్రామానికి చెందిన నార్వాడే నగాబాయి,కదం రుక్మిణి బాయి ఇటీవల పరమపదించిన విషయం తెలుసుకున్న ప్రజా ట్రస్ట్ చైర్మన్ మోహన్ రావు పటేల్ వారి కుటుంబ సభ్యులను పరామర్శించి,ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.ఈ కష్ట సమయంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని కోరారు,కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థించారు.వారితో తో పాటు సర్పంచ్ భుజంగ రావు సామారెడ్డి,అనిల్, పాల్గొన్నారు.



# మున్నూరు కాపు సంఘం ఆన్‌లైన్ సభ్యత్వ నమోదు



**ప్రజాపక్షం / నిజామాబాద్ అర్బన్ :** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా మున్నూరు కాపు సంఘం ఆన్‌లైన్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రతి ఒక్క కాపు కులస్తులు వినియోగించుకోవాలని తెలంగాణ మున్నూరు కాపు సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షులు కొండ దేవన్న పిలుపునిచ్చారు. గురువారం నిజామాబాద్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆన్‌లైన్ సభ్యత్వ నమోదు స్కానర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ వ్యాప్తంగా కాపు సంఘం ఆధ్వర్యంలో ఆన్‌లైన్ నమోదు కార్యక్రమం ఇప్పటికే ప్రారంభమైందన్నారు. మున్నూరు కాపు సామాజిక వర్గానికి చెందిన ప్రతి ఒక్కరు ఈ కార్యక్రమంలో భాగస్వామి కావాలని కోరారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కాపుల సంఖ్యకి, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కాపుల జనాభా అత్యధికంగా తగ్గినట్టుగా నివేదికలు చూపిస్తున్నాయని, ఇది కాపు కులస్తుల అస్తిత్వానికి ప్రమాద సూచికని అన్నారు. కావున ప్రతి ఒక్క కాపు కులస్తుడు యాప్‌లో సభ్యత్వ నమోదు చేసుకొని కాపుల హక్కులను పరిరక్షించుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్క కాపు బిడ్డపై ఉందన్నారు. కార్యక్రమంలో ఆకుల శ్రీశైలం, గాండ్ల లింగం, రంగు సీతారాం, రాము, ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఎడపల్లిలో సద్దుల బతుకమ్మ

బతుకమ్మ ఆలస్యానికి భిన్న కథనాలు, 67ఏండ్లుగా ఆనవాయితీ



**ప్రజాపక్షం/ఎడపల్లి:** పండగపూట ఇంట్లో ఆడపడుచులు వుంటే ఆనందం రెట్టింపు అవుతోందని ఆలస్యంగానైనా వారి సమక్షంలో పండగ జరుపుకోవాలనే సంప్రదాయం ఎడపల్లి మండల కేంద్రంలో ఆనవాయితీగా కొనసాగుతుంది. రాష్ట్ర వ్యాప్తంగా దసరా పండగకు ముందు బతుకమ్మ పండగను నిర్వహిస్తారు. కానీ ఎడపల్లి మండల కేంద్రంలో మాత్రం అలా జరుపుకోరు. దసరా అనంతరం ఐదు రోజులకు అంగరంగ వైభవంగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుంది. 66ఏండ్లకు పైగా వస్తున్న ఆచారాన్ని నేటికి కొనసాగిస్తున్నారు. ఇందుకోసం ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రతిఏటా దసరా తరువాత పౌర్ణమికి ముందు ఇక్కడ భిన్నంగా బతుకమ్మ పండగ నిర్వహిస్తారు. సుమారు రెండు వేలకు పైగా బతుకమ్మలను పేర్చి ఆడుతారు. అందరితో కలిసి పండగని ఘనంగా నిర్వహించుకోవచ్చనే భావనతో దసరా తరువాత ఐదవ రోజు పౌర్ణమికి ముందు బతుకమ్మను నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. ఆరోజు మృతి చెందిన సిపాయి శవాన్ని, బతుకమ్మను ఊరేగించడం గ్రామానికి మంచిది కాదని భావించారు. అలాగే సిపాయి మృతిని ముట్టుడుగా భావించి ఆ సంవత్సరం నుంచి బతుకమ్మ పండగ దసరాకు ముందు జరపడం మానేశారు. అప్పటి నుంచి దసరా తరువాత బతుకమ్మ ఆడటం ప్రారంభించారు. ఇదే ఆనవాయితీ ఇప్పటికీ కొనసాగుతుంది.బతుకమ్మ పండుగ కోసం గ్రామస్తులు పది రోజుల ముందు నుంచే గునక పూలను సేకరిస్తారు. వీటితో పెద్దపెద్ద బతుకమ్మలను తయారు చేస్తారు. ఒక్కో బతుకమ్మను నిలువెత్తు కంటే ఎత్తుగా పెద్ద పెద్దగా చేయడానికి పోటీపడతారు. రేపు ఎడపల్లి మండల కేంద్రంలో బతుకమ్మ ఉత్సవాలు ఉండటంతో ఏర్పాట్లను ముమ్మరం చేశారు. ఆ రోజు నుంచి సాయంత్రం నాలుగు గంటలకు గడీ వద్దకు మహిళలు చేరుకుంటారు. ముందుగా దేశ్‌ముఖ్ గడిలోనే మొదలయ్యేది. గతంలో జరిగిన సంఘటనల వల్ల దసరాకు ముందు కాకుండా దసరా తరువాత జరిపాలన్న ఉద్దేశ్యంతో ఆనవాయితీగా కొనసాగిస్తూ వస్తున్నారు. మహిళలు, గ్రామ ఆడపడుచులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలి.

# టిజిపిఎస్‌సి పరీక్షా కేంద్రంలో ఏర్పాట్ల పరిశీలన

కలెక్టర్ ఇలా త్రిపాఠి

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమీషన్ ఆధ్వర్యంలో ఈనెల 24, 26లలో కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ విధానంలో పరీక్షలు జరగనున్న నేపథ్యంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి గురువారం సాయంత్రం పరీక్షా కేంద్రాన్ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. కాలుష్య నియంత్రణ మండలిలో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ సైంటిస్ట్ (అనలిస్ట్) అసిస్టెంట్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ పోస్టుల భర్తీ కోసం టీజీపీఎస్సీ ద్వారా ఈనెల 24, 26 లలో జిల్లాలోని ఆర్సపల్లిలోని ఎవి ఎంటర్ ప్రైజెస్ సెంటర్‌లో పరీక్షలు నిర్వహించనుండగా పరీక్షా కేంద్రంలో సరిపడా కంప్యూటర్లు, సీసీ కెమెరాలు, బయోమెట్రిక్ ధృవీకరణ పరికరాలు, ఇంటర్నెట్ కనెక్షన్ ఇత్యాది సదుపాయాలు అందుబాటులో ఉన్నాయా లేవా అని కలెక్టర్ గమనించారు. పరీక్షల నిర్వహణలో లోటుపాట్లకు తావు లేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, ఎగ్జామ్ సెంటర్ల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని, క్షుణ్ణంగా తనికీలు నిర్వహించి అభ్యర్థులను లోనికి పంపాలని, ఎలక్ట్రానిక్ ఉపకరణాలను అనుమతించకూడదని సూచించారు. కాగా నిర్ణీత సమయానికి ముందే అభ్యర్థులు పరీక్షా కేంద్రం వద్దకు చేరుకోవాలని కలెక్టర్ హితవు పలికారు. అభ్యర్థులకు ఉదయం 10 గంటల నుండి 12.30 గంటల వరకు మొదటి సెషన్, మధ్యాహ్నం 2.30 నుండి 5 గంటల వరకు సెకండ్ సెషన్ పరీక్షలు జరుగుతాయన్నారు. ఎగ్జామినేషన్ డ్యూటీలో పాల్గొంటున్న అధికారులు, సిబ్బందికి సంబంధించిన బంధువులు ఎవరూ పరీక్ష రాయడం లేదని వారి నుండి ధృవీకరణ పత్రం తీసుకోవాలని నిర్వాహకులను ఆదేశించారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ భుజంగ రావు, ఆర్డీఓ రాజేంద్రకుమార్, ట్రైనీ సబ్‌కలెక్టర్ సందీప్, ఇన్‌చార్జి డీఈఓ సాయగౌడ్, డీఐఈఓ రవికుమార్, డీఎం అండ్‌హెచ్ఓ డాక్టర్ రాజశ్రీ, పరీక్షా కేంద్రం నిర్వాహకులు అయూబ్, తహసీల్దార్ హరికిషోర్ ఉన్నారు.

# దిలావర్‌పూర్ మండలంలో డిపిఓ పర్యటన

**ప్రజా పక్షం/దిలావర్‌పూర్ :** మండలంలో జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) శ్రీనివాస్ పర్యటించి గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ, పర్యావరణ పరిరక్షణకు చేపడుతున్న కార్యక్రమాలను పరిశీలించారు.సిర్గాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన స్టీల్ బ్యాంక్ ను ప్రారంభించి ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడంతో పాటు,పర్యావరణ పరిరక్షణకు చర్యలు చేపట్టడం అభినందనీయమని డీపీఓ పేర్కొన్నారు.గ్రామాల్లో జరిగే శుభకార్యాలు,సమావేశాలు,ఇతర కార్యక్రమాల్లో ప్లాస్టిక్ వస్తువులకు బదులుగా స్టీల్ పాత్రలను వినియోగించేలా ప్రజలను ప్రోత్సహించాలని సూచించారు.స్టీల్ బ్యాంక్ సేవలను గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.అనంతరం న్యాలోలం గ్రామంలో పారిశుధ్య నిర్వహణను డీపీఓ పరిశీలించారు. గ్రామంలోని వీధులు, పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రతను కాపాడుకోవాల్సిన ఆవశ్యకతను వివరించారు. గ్రామస్తులకు చెత్తబుట్టలను పంపిణీ చేశారు.

# రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ డాక్టర్ క్రాంతి కుమార్ అడేకు సన్మానం

**ప్రజాపక్షం/నేరడిగొండ:** ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆదిలాబాద్ జిల్లా చైర్మన్‌గా ఎన్నికైన డాక్టర్ క్రాంతి కుమార్ అడేను టీజీటీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జాధవ్ రవీందర్, చవాన్ నరేష్ గురువారం శాలువాతో ఘనంగా సన్మానించారు. గిరిజన ప్రాంతాలకు చెందిన వైద్యుడిగా, ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తూ సామాజిక సేవలో ముందంజలో ఉన్న క్రాంతికుమార్ భారీ మెజారిటీతో చైర్మన్‌గా గెలవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో రమేష్, గోకుల్, మదన్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

# బ్రాహ్మణ సమాజ్ స్నేహపూర్వక క్రికెట్ టోర్నీ

బైరాంబట్ టీమ్ విజయం

**ప్రజాపక్షం/మావల:** బ్రాహ్మణ సమాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్నేహపూర్వక క్రికెట్ మ్యాచ్‌లు ఉత్సాహంగా ముగిశాయి. 15 ఏళ్ల యువకుల నుంచి 60 ఏళ్ల పెద్దల వరకు అందరూ పాల్గొని క్రీడా స్ఫూర్తిని చాటారు. ఉత్కంఠభరితంగా జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో బైరాంబట్ టీమ్ విజేతగా నిలిచింది. క్రీడల ద్వారా సమాజంలో ఐక్యత, స్నేహభావం పెంపొందుతుందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో సమాజ సభ్యులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

# రోడ్డుపై ధాన్యం కుప్పను బైక్ ఢీకొని యువకుడికి తీవ్ర గాయాలు



**ప్రజాపక్షం/ఎడపల్లి:** రహదారులపై ఇష్టారాజ్యంగా ఆరబోస్తున్న ధాన్యం కుప్పలు వాహనదారుల పాలిట మృత్యుశపాశాలుగా మారుతున్నాయి. తాజాగా ధాన్యం కుప్పను బైక్ ఢీకొన్న ప్రమాదంలో ఒక యువకుడు తీవ్రంగా గాయపడి, పరిస్థితి విషమంగా మారిన సంఘటన ఎడపల్లి మండలంలో చోటుచేసుకుంది. స్థానిక సర్పంచ్ వినోద్ అందించిన వివరాల ప్రకారం.. ఏఆర్పీ క్యాంప్ గ్రామానికి చెందిన శివ కుమార్ మంగళవారం రాత్రి బైక్‌పై నిజామాబాద్ వైపు బయలుదేరాడు. ఏఆర్పీ క్యాంప్ గ్రామ శివారులోకి రాగానే, రహదారిపై ఆరబోసి ప్లాస్టిక్ కవర్ కప్పి ఉంచిన ధాన్యం కుప్ప చీకట్లో స్పష్టంగా కనిపించకపోవడంతో బైక్ దాన్ని వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శివ కుమార్ కిందపడిపోవడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఆయన్ను ఆస్పత్రికి తరలించగా, ప్రస్తుతం ఆయన పరిస్థితి విషమంగా ఉన్నట్లు డాక్టర్లు తెలిపారు. శివ కుమార్ కుమారుడు అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆస్పత్రిలో ఉన్న కుమారుడిని చూడటానికి వెళ్తున్న క్రమంలోనే తండ్రి ప్రమాదానికి గురి కావడం ఆ కుటుంబంలో తీవ్ర శోకాన్ని నింపింది. శివ కుమార్ కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. రైతులు రహదారులపై నిబంధనలకు విరుద్ధంగా ధాన్యం కుప్పలు ఆరబెట్టడం వల్లే ఇటువంటి ప్రమాదాలు జరిగి వాహనదారులు ప్రాణాలు కోల్పోవడం లేదా తీవ్ర గాయాల పాలు కావడం జరుగుతోందని సర్పంచ్ వినోద్ ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు స్పందించి, రోడ్లపై ధాన్యం ఆరబోయకుండా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

# పూర్వ విద్యార్థుల సమ్మేళనం

విద్యార్థుల సిల్వర్ జూబ్లీ వేడుక



**ప్రజాపక్షం/మాక్లూర్ :** మండలంలోని గొట్టుముక్కుల జడ్పీహెచ్ఎస్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం గురువారం ఘనంగా నిర్వహించారు. 200001బ్యాచ్ విద్యార్థులు తాము 10వ తరగతి ముగించుకుని 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ సిల్వర్ జూబ్లీ వేడుకలు (రజతోత్సవం) ఏర్పాటు చేశారు. పూర్వ విద్యార్థులు ప్రస్తుత పరిస్థితులను, కుటుంబ నేపథ్యాన్ని సభలో పంచుకున్నారు. విద్యాబుద్ధులు నేర్చుకున్న పూర్వ విద్యార్థుల పిల్లలు ఎవరైనా చదువులో ప్రతిభ కనబరుస్తూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటే వారి విద్యాభివృద్ధికి తమ వంతు సహకారాన్ని అందిస్తానని భరోసానిచ్చారు. తోటి విద్యార్థులు ఉన్నత స్థాయిలో ఉన్నారని, తాము మాత్రం సాధారణ జీవితం గడుపుతున్నామన్న భావన ఎప్పటికీ రానీయవద్దని చెప్పారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులను శాలువలు, పూల మాలలు, మెమోంటోలతో ఘనంగా సన్మానించారు.

## బిజెపి నుండి కాంగ్రెస్‌లోకి చేరిక



ప్రజాపక్షం/మంచిర్యాల టౌన్ : మంచిర్యాల మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలోని 27వ డివిజన్‌కు చెందిన బిజెపి పార్టీ నాయకులు కాంగ్రెస్ పార్టీలోకి చేరారు. మంచిర్యాల నియోజకవర్గంలో ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై 27వ డివిజన్‌కు చెందిన బిజెపి పార్టీ నాయకుడు అత్తాపురం నరేష్ కాంగ్రెస్ పార్టీలోకి రావడంతో మాజీ జిల్లా డిసిసి అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల మున్సిపల్ కార్పోరేషన్ మేయర్ ధర్ని మధుకర్, టిపిసిసి సభ్యుడు ఇంచార్జి నూకల రమేష్, స్థానిక కార్పోరేటర్ కొంద్ర రాజేశ్వరి,లింగయ్య పాల్గొన్నారు.

## గిరిజబాయి కుటుంబాన్ని పరామర్శించిన సుగుణక్క



ప్రజాపక్షం / జైనూర్: అనారోగ్యంతో మృతి చెందిన ఆత్రం గిరిజబాయి కుటుంబ సభ్యులను కాంగ్రెస్ పార్టీ ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మండలంలోని పవర్‌గూడ పంచాయతీ కాలేజ్‌గూడ గ్రామానికి చెందిన గిరిజబాయి ఇటీవల కన్నుమూశారు. విషయం తెలుసుకున్న సుగుణక్క గురువారం ఆమె నివాసానికి వెళ్లి చిత్రపటానికి పూలమాలలు వేసి, ఆదివాసీ సంప్రదాయం ప్రకారం పూజలు చేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు షేక్ రషీద్, సర్పంచ్ తొడసం రాజేందర్, ఉప సర్పంచ్‌లు కరాడ్ ఉద్ధవ్, డొంగ్రే ప్రకాష్, డిసిసి నాయకులు ప్రకాష్, షేక్ రహీం, షేక్ అబ్బు, నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా కొమురం భీం జయంతి వేడుకలు

ప్రజాపక్షం/జైపూర్: ఆదివాసీ పోరాట యోధుడు కొమురం భీం జయంతి వేడుకలను జైపూర్ మండల కేంద్రంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఆదివాసీ హక్కుల పరిరక్షణ కమిటీ మండల అధ్యక్షుడు బిస్పుల రవి ఆధ్వర్యంలో స్థానిక కొమురం భీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆదివాసీల ఆత్మగౌరవం, హక్కుల సాధన కోసం భీం సాగించిన పోరాటం చిరస్మరణీయమని, ఆయన చూపిన మార్గం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని కొనియాడారు. కార్యక్రమంలో జైపూర్ సర్పంచ్ కూన భాస్కర్, తుడుందెబ్బ జిల్లా ఉపాధ్యక్షుడు బైర్నేని అశోక్, ప్రచార కార్యదర్శి పళ్ల రాజు కుమార్, ఆదివాసీ నాయకులు పాల్గొన్నారు.



## మంచిర్యాల నియోజకవర్గంలో శాంతిభద్రతలను పరిరక్షించాలి

### బిజెపి జిల్లా అధికార ప్రతినిధి నాగరాజు



ప్రజాపక్షం/మంచిర్యాల టౌన్ : మంచిర్యాల నియోజకవర్గంలో పెరుగుతున్న గ్యాంగ్ గొడవలు, బహిరంగదాడులు, మత్తు పదార్థాల వినియోగం ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించి ప్రజలకు శాంతి భద్రతలను కల్పించాలని బిజెపి మంచిర్యాల జిల్లా అధికార ప్రతినిధి, కార్పోరేటర్ కస్తూరి నాగరాజు గురువారం పేర్కొన్నారు. నియోజకవర్గంలో యువత భవిష్యత్‌ను కాపాడటంతో పాటు మత్తు పదార్థాల సరఫరా, వినియోగంపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్థానికంగా కొనసాగుతున్న ఆధిపత్యపోరాటాల్లో యువకులను వినియోగించుకుంటు వారి జీవితాలను ప్రమాదంలోకి నెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తరుచు చోటు చేసుకుంటున్న గొడవలు, దాడుల కారణంగా ప్రజలు స్వేచ్ఛగా జీవించలేని పరిస్థితులు ఏర్పడుతున్నాయని, ప్రజా సమస్యలపై నిరసనలు చేపట్టే సందర్భాల్లో పెద్ద సంఖ్యలో పోలీసు బలగాలను మోహరించి రాజకీయ నాయకులను నియంత్రిస్తున్న పోలీసులు అదే స్థాయిలో శాంతిభద్రతల పరిరక్షణకు ఎందుకు సమర్థవంతమైన చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా నియోజకవర్గంలో గ్యాంగ్ గొడవలు, బహిరంగ దాడులు, మత్తు పదార్థాల వ్యవహారంపై ప్రత్యేక విచారణ చేపట్టాలని, చట్టవిరుద్ధ కార్యకలాపాల పాల్పడుతున్న వారిపైన రాజకీయ సంబంధాలతో నిమిత్తం లేకుండా చట్టప్రకారం కఠిన చర్యలు చేపట్టాలని, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల పనితీరుపై సమగ్ర సమీక్ష నిర్వహించి, విధుల నిర్వహణలో నిర్లక్ష్యం, అవినీతి జరిగినట్లు ఆధారాలు లభిస్తే నిష్పక్షపాత విచారణ జరిపించాలని, ప్రజలు తమ ఫిర్యాదులను నిర్భయంగా తెలియజేసే విధంగా పోలీసు వ్యవస్థపై విశ్వాసం పెంపొందించాలని ఫిర్యాదులపై సత్వర చర్యలు తీసుకోవాలని బిజెపి డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు.

## కుటుంబ ఆర్థిక భద్రతకు బీమా రక్ష

### సర్పంచ్ బెండారే కృష్ణాజీ




ప్రజాపక్షం / వాంకిడి: కుటుంబానికి ఆర్థిక భద్రత చేకూరాలంటే ప్రతి ఒక్కరూ బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ బెండారే కృష్ణాజీ పేర్కొన్నారు. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలంలోని బంబార గ్రామపంచాయతీ కార్యాలయంలో ప్రజల్లో ఆర్థిక అక్షరాస్యత పెంపొందించేందుకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో టిజిబి బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజలు సంపాదనలో కొంత భాగాన్ని భవిష్యత్తు కోసం పొదుపు చేయాలని సూచించారు. కుటుంబంలో అనుకోని కష్టాలు ఎదురైనప్పుడు బీమా పథకాలు రక్షణగా నిలుస్తాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జన సురక్షతో పాటు వివిధ బీమా, పొదుపు పథకాలపై గ్రామీణులు అవగాహన పెంచుకోవాలని పిలుపునిచ్చారు. సర్పంచ్ కృష్ణాజీ మాట్లాడుతూ, చిన్నారుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని తల్లిదండ్రులు చిన్న వయస్సు నుంచే పొదుపు ప్రారంభించాలని చెప్పారు. ఆడపిల్లల ఉన్నత చదువులు, ఇతర అవసరాల కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సుకన్య సమృద్ధి యోజన వంటి పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు. బ్యాంకు సేవలపై అవగాహన పెంచుకోవడం ద్వారా ప్రణాళికాబద్ధంగా జీవించవచ్చని పేర్కొన్నారు. ఉపసర్పంచ్ జాడే సంతోష్, ఆర్థిక అక్షరాస్యత కేంద్రం ప్రతినిధులు ప్రశాంత్, సంజీవ్, సాయికిరణ్, ఐకెపి సిబ్బంది కిరణ్, కేశవరావు, సుబ్బన్, గ్రామస్థులు పాల్గొన్నారు.

## మందమర్రి ఆయిల్‌పామ్ సాగు ఇతర ఏరియాలకు ఆదర్శం

### సింగరేణి సంస్థ డైరెక్టర్ వెంకటేశ్వర్లు



ప్రజాపక్షం / మందమర్రి: సింగరేణి మందమర్రి ఏరియాలో చేపట్టిన ఆయిల్‌పామ్ సాగు ఇతర ఏరియాలకు ఆదర్శంగా నిలవాలని సంస్థ డైరెక్టర్ (ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్) కె. వెంకటేశ్వర్లు ఆకాంక్షించారు. బొగ్గు ఉత్పత్తితో పాటు పర్యావరణ పరిరక్షణ, ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాలపై దృష్టి సారించాలని సూచించారు. గురువారం మందమర్రి ఏరియాలో పర్యటించిన ఆయన జిఎం కార్యాలయంలో అధికారులతో బొగ్గు ఉత్పత్తి, అభివృద్ధి పనులపై సమీక్షించారు. అనంతరం కెకె2 గని సమీపంలో రెండు హెక్టార్ల విస్తీర్ణంలో ఆయిల్‌పామ్ మొక్కలను నాటారు. కెకె ఓపెన్‌కాస్ట్ గనిని సందర్శించి రక్షణతో కూడిన ఉత్పత్తిని సాధించాలని స్పష్టం చేశారు. చెత్లాపూర్‌లో తాగునీటి సరఫరా కోసం ఏర్పాటు చేసిన నూతన పంప్‌హౌస్‌ను జిఎం ఎన్. రాధాకృష్ణతో కలిసి ప్రారంభించారు. శ్రావణపల్లి ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టు పరిధిని కూడా ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఏరియా జిఎం రాధాకృష్ణ, ఎస్ఓటు జిఎం జివిఎల్ ప్రసాద్, ఏఐటియుసి బ్రాంచ్ కార్యదర్శులు శైలేంద్ర సత్యనారాయణ, దాగ మల్లేష్, ప్రాజెక్టు అధికారి రాంబాబు, అధికారులు, కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## లో-వోల్టేజ్ సమస్యకు ఆరు ట్రాన్స్‌ఫార్మర్లు

### జిల్లా విద్యుత్ అధికారి ఉత్తమ్ జాడే



ప్రజాపక్షం / జైనూర్: తక్కువ వోల్టేజ్ సమస్యను నివారించేందుకు ఆసిఫాబాద్ జిల్లా వ్యాప్తంగా ఆరు కొత్త ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసినట్లు జిల్లా విద్యుత్ అధికారి ఉత్తమ్ జాడే తెలిపారు. సిర్పూర్ (యు) మండలంలోని పుల్లారా గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను సర్పంచ్ వేద్మ జంగుబాయితో కలిసి ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉత్తమ్ జాడే మాట్లాడుతూ వేసవిలో పెరిగే విద్యుత్ లోడ్‌ను దృష్టిలో ఉంచుకొని సిర్పూర్ (యు) పరిధిలోని దేవుడుపల్లి, పుల్లారా, సెట్టిహడప్నూర్, బందెయర్, మహాగాం, అలిగూడ గ్రామాల్లో వీటిని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. విద్యుత్ సరఫరా మరింత మెరుగుపడుతుందని, ప్రజలు విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలని సూచించారు.ఎడిఎ దుస్సా శ్రీనివాస్, ఏఇ రావుల సాయికృష్ణ, సిబ్బంది ధనంజయ, లక్ష్మణ్ పాల్గొన్నారు.

## ప్రమాదకరంగా ఉన్న డ్రైనేజీని పూర్తి చేయండి



ప్రజాపక్షం/మంచిర్యాల టౌన్ : మంచిర్యాల పట్టణంలోని బెల్లంపల్లి చౌరస్తాలో అసంపూర్తిగా వదిలేసిన సైడ్ డ్రైనేజీ వల్ల ఈ చౌరస్తాలో రాకపోకలకు ప్రజలు , వాహనదారులు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. పట్టణ సుందరీకరణ పనులలో భాగంగా బస్టాండ్ ఏరియాలో ఇరువైపులా మురికి కాలువలను నిర్మిస్తుండగా ప్రజలకు, వ్యాపారవేత్తలకు ఇబ్బందులు కలుగకుండా పనులను వేగంగా నిర్వహిస్తున్నప్పటికి బెల్లంపల్లి చౌరస్తాలో మాత్రం సైడ్ డ్రైనేజీ నిర్మాణంలో భాగంగా ఇనుపరాడ్లు బయటకు తేలి ఉన్నప్పటికి సంబంధిత గుత్తేదారులు పట్టించుకోకపోవడం చుట్టు గుంతలు అలాగే వదిలివేయడంతో ఆ దారి మూసుకుపోయి ట్రాఫిక్‌కు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రధాన బెల్లంపల్లి చౌరస్తాలో ఇలా గుంతలు తవ్వి అసంపూర్తిగా డ్రైనేజీ నిర్మాణంను వెంటనే పూర్తి చేసి ప్రజల రాకపోకలకు , ట్రాఫిక్‌కు ఇబ్బంది కలుగకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

## ఆపదలో ఉన్న కుటుంబానికి ఆర్థిక చేయూత



ప్రజాపక్షం/మంచిర్యాల టౌన్ : ఆపదలో ఉన్న వారికి అండగా నిలవడమే నిజమైన మానవత్వమని ఎడిఎంఎస్ నెట్‌వర్క్ బిజినెస్ సభ్యులు చాటిచెప్పారు. గుండె సంబంధిత అనారోగ్యంతో నిర్మల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మంచిర్యాల జిల్లా జన్నారంకు చెందిన అనూషకు వైద్య ఖర్చుల నిమిత్తం 30 వేల ఆర్థిక సాయం అందించారు. వివరాల్లోకి వెళితే.. ఎడిఎంఎస్ మార్కెటింగ్ ప్రైవేటు నెట్‌వర్క్ బిజినెస్‌లో పని చేస్తున్న అనూష గుండె సంబంధిత అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరగా వారి ఆర్థిక పరిస్థితి లేకపోవడంతో ఆ సంస్థ కోర్ కంపెనీ సభ్యులు పి.సతీష్ మాట్లాడుతూ, ఈ వ్యాపారంలో ఆర్థికంగా ఎదగడంతో పాటు ఆపదలో ఉన్న సభ్యులకు కుటుంబంలా అండగా నిలుస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కో కమిటి సభ్యులు శైలజరెడ్డి, కె.శేఖర్, రాజేశ్, పాదం మౌనిక, కళావతి, బాలకిషన్, కామెర వెంకటస్వామి పాల్గొన్నారు.

## వాసవిక్లబ్ ఆధ్వర్యంలో దశసేవా కార్యక్రమాలు

ప్రజాపక్షం/మంచిర్యాల టౌన్ : విజయదశమి పర్వదినం సందర్భంగా మంచిర్యాల వాసవిక్లబ్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ వాసవి క్లబ్స్ పిలుపులో భాగంగా దశ సేవా దీప్తులు కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించారు. వాసవిక్లబ్ అధ్యక్షుడు వెనిశెట్టి రాఘవేంద్ర, కార్యదర్శి గుండా మనోహర్, కోశాధికారి బండ శ్రీనివాస్‌ల ఆధ్వర్యంలో పది సేవా కార్యక్రమాలను మంచిర్యాలలో నిర్వహించారు. ఇందులో భాగంగా పేద విద్యార్థులకు నోటుపుస్తకాలు, స్టేషనరీ పంపిణీ చేశారు. అలాగే దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అమ్మవారికి చీర, సారెను సమర్పించి భక్తులకు పండ్లు, అన్నప్రసాదం అందజేశారు. ముత్తైదువులకు పసుపు కుంకుమ, రవిక, గాజులను అందజేసి పలువురు వృద్ధులకు పెన్షన్లను పంపిణీ చేశారు. దుర్గాదేవి హోమంతో పాటు అమ్మవారికి వద్ద విజయకంకణాలను క్లబ్ సభ్యులకు అందజేసి బ్రాహ్మణ మహిళలకు ఓడిబియ్యం, అమ్మవారి పటాలను అందజేశారు. పలువురు చిన్నారులకు దుస్తులను అందజేశారు. ఈ దశదీప్త కార్యక్రమాలలో వాసవిక్లబ్ జిల్లా గవర్నర్ పుల్లూరి బాలమోహన్, క్యాబినెట్ సెక్రటరి సేవ కేశెట్టి వంశీకృష్ణ, కోశాధికారి కొంకముట్టి వెంకటేష్, జోన్ ఛైర్మన్ ఇరుకుల్ల సూర్యనారాయణ తదితరుల పాల్గొన్నారు.

# అర్హులందరికీ ఉచిత న్యాయ సేవలు

జడ్జి జి. అనూష




**ప్రజాపక్షం / వాంకిడి:** పేదలు, బడుగు బలహీన వర్గాల ప్రజలకు ఉచిత న్యాయ సేవలు అందుబాటులో ఉన్నాయని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, జడ్జి జి. అనూష తెలిపారు. వాంకిడి మండలం లోని దొడ్డిగూడలో ఉచిత న్యాయ సేవలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, న్యాయవా దిని పెట్టుకోలేని పేదలు, మహిళలు, పిల్లలు, దివ్యాంగులు, ఎస్‌సి, ఎస్‌టి వర్గాల వారు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉచిత న్యాయ సహాయం పొందవచ్చని పేర్కొన్నారు. సమ స్యలు ఎదురైనప్పుడు చట్టబద్ధమైన పరి ష్కారం కోసం టోల్‌ఫ్రీ నంబర్ 15100ను సంప్రదించి సేవలను సద్వినియోగం చేసుకో వాలని కోరారు.

# రాళ్ళవాగు బ్రిడ్జి నిర్మాణ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/మంచిర్యాల టౌన్ :** మంచి ర్యాల పట్టణ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా రాకపోకలకు ప్రత్యామ్నాయ మార్గం ఏర్పాటు చేయాలని మంచిర్యాల శాసనసభ్యుడు కొక్కిరాల ప్రేంసాగర్‌రావు అధికారులకు సూచించారు. గురువారం మంచిర్యాల రాళ్ళవాగు బ్రిడ్జి నిర్మాణ పను లను ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా రాళ్ళ వాగు బ్రిడ్జి పనులు జరుగుతున్న సమ యంలో ప్రజలకు వాహనదారులకు రాకపో కల్లో ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా తాత్కాలికంగా మట్టి రోడ్డును ఏర్పాటు చేయాలని మున్సిపల్ అధికారులను, ఆర్ అండ్ బి అధికారులను సూచించారు. ప్రజల సౌకర్యానికి ప్రాధాన్యత ఇస్తు నిర్మాణ పనుల సమయంలో రాకపోకలకు ఇబ్బం దులు లేకుండా అవసరమైన చర్యలు తీసుకో వాలని అధికారులకు సూచించారు. ప్రజా సౌకర్యమే తమ ప్రథమ ప్రాధాన్యత అని ప్రజల సమస్యల పరిష్కారమే తమ లక్ష్యం అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్పోరేషన్ మేయర్ ధర్ని మధుకర్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తూముల నరేష్, జిల్లా ఆర్‌జిపిఆర్‌ఎస్ అధ్యక్షుడు గడ్డం త్రిమూర్తి, సంబంధిత అధికారులు, కార్పోరే టర్లు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# జనాభా గణనలో ఛార్జ్ అధికారుల పాత్ర కీలకం

జిల్లా అదనపు కలెక్టర్ యువరాజ్ మర్మాట్



**ప్రజాపక్షం / ఆసిఫాబాద్:** జనాభా గణన ప్రక్రియలో ఛార్జ్ అధికారుల పాత్ర అత్యంత కీలకమైనదని జిల్లా అద నపు కలెక్టర్ యువరాజ్ మర్మాట్ పేర్కొన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో తహశీల్దార్లు, ఎంపిడిఒలు, మున్సి పల్ కమిషనర్లకు గురువారం ఏర్పాటు చేసిన శిక్షణ కార్య క్రమంలో కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ హర్ష చౌదరితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ తహశీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపి డిఒలు ఛార్జ్ అధికారులుగా వ్యవహరిస్తూ ప్రక్రియను ప్రశాంతంగా పూర్తి చేయాలని సూచించారు. రెండు విడ తల్లో జరిగే ఈ గణ నలో మొదటి విడతలో నివాస గృహాలు, రెండో విడతలో జనాభా వివరాలు సేక రిస్తారని తెలిపారు. అధికారులు ప్రతి అంశంపై పూర్తి అవగా హన కలిగి ఉండాలని స్పష్టం చేశారు. కాసిపిఒ గురువయ్య, జడ్‌పి సిఇఒ లక్ష్మీ నారాయణ, డిపిఒ భిక్షపతి, అధికారులు పాల్గొన్నారు.

# యాసంగిలో ఆరుతడి పంటలే మేలు

మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రత్నం సుకుమారి



**ప్రజాపక్షం / కాసిపేట:** రైతులు తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించాలని, సిసిఐ ద్వారా త్వరలోనే పత్తి కొనుగోళ్లు ప్రారంభం కానున్నందున దళారులను నమ్మి మోసపోవద్దని బెల్లంపల్లి మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రత్నం సుకుమారి సూచించారు. కాసిపేట మండలంలోని ముత్యంపల్లి, ధర్మరావుపేట రైతు వేదికల్లో గురువారం రైతు నేస్తం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సంద ర్భంగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతూ, నేలసా రాన్ని కాపాడేందుకు రసాయనాలు తగ్గించి ప్రకృతి వ్య వసాయం చేయాలని పిలుపునిచ్చారు. యాసంగిలో వరికి బదులుగా తక్కువ నీటితో పండే ఆరుతడి పంటలనే సాగు చేయాలని, పంట మార్పిడి విధానాన్ని తప్పనిసరిగా పాటిం చాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ముత్యంపల్లి సర్పంచ్ చాహటి సుగుణ, వ్యవసాయ సంచాలకులు రాజ నరేందర్, ఆత్మ చైర్మన్ రౌతు సత్తయ్య, ఎఒ చల్లా ప్రభాకర్, ఎఇఒలు సాగర్, నాగదీప్తి, రైతులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి బాలమిత్ర అవార్డులకు ధరఖాస్తుల ఆహ్వానం

బాలల హక్కుల ప్రజావేదిక అధ్యక్షుడు చంద్రబోస్



**ప్రజాపక్షం/మంచిర్యాల టౌన్ :** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా బాలల హక్కుల ప్రజావేదిక ఆధ్వర్యంలో నవం బర్ 14న బాలల దినోత్సవం సందర్భంగా 34 రంగా లలో ప్రతిభ కలిగిన విద్యార్థులకు అవార్డులను అందజే యడానికి ధరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల ప్రజావేదిక అధ్యక్షుడు వలస సుభాష్ చంద్రబోస్ తెలిపారు.గురువారం మంచిర్యాలలో విలేకరులతో మాట్లాడుతూ, బాలల దినోత్సవం సంద ర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా 14 సంవత్సరాల వయసు గల విద్యార్థులకు 34 రంగాలలో ప్రతిభ కలిగిన వారిని ఎంపిక చేసి రాష్ట్ర స్థాయి బాలమిత్ర అవార్డులను హైదరా బాద్‌లో ఏర్పాటు చేసే కార్యక్రమంలో అవార్డులను అంద జేస్తామని వివరించారు. విద్యార్థులలో దాగివున్న సృజనా త్మకత శక్తిని వెలికి తీసేందుకు రాష్ట్రస్థాయిలో ఈ బాల మిత్ర అవార్డులు అందజేస్తున్నామని, ధరఖాస్తులు చేసు కునే విద్యార్థులు దేశభక్తి పాటలు, భరతనాట్యం, గిటార్, కీబోర్డు, ప్లేయింగ్, ఫ్లూట్, పర్వతారోహణ, యోగా, చిత్రలేఖనం, కార్టూన్స్, కవిత్వం, జానపద పాటలు, మిమిక్రి, మ్యాజిక్, సైకిలింగ్, వాలీబాల్, కబడ్డి, కోకో ఇలా వివిధ రంగాలలో నైపుణ్యం కలిగిన విద్యార్థులకు వారి వద్ద ఉన్న సర్టిఫికెట్లు ఆధారంగా బాలల హక్కుల ప్రజావేదిక అవార్డులు అంద జేస్తామని తెలిపారు. నవంబర్ 5వ తేదీ సాయంత్రం ఐదు గంటలలోపు విద్యార్థులు తమ వద్ద సర్టిఫికెట్లు, బయో డేటా ధరఖాస్తు కు ఫోటోను జతచేసి పోస్టు ద్వారా వలస సుభాష్‌చంద్రబోస్, రాష్ట్ర బాలల హక్కుల ప్రజావేదిక అధ్యక్షుడు, ఇంటి నంబర్ 292, కూరెల్ల గ్రామం, కోహెడ మండలం, సిద్దిపేట జిల్లా పిన్ నంబర్ 505473 చిరునా మాకు పోస్టుద్వారా పంపాలని కోరారు.

# బడులు తెరిచే రోజు వంద శాతం హాజరు కావాలి

ఎంఇఒ వైరాగడే శివచరణ్ కుమార్

**ప్రజాపక్షం / వాంకిడి:** పాఠశాలలు పునఃప్రారంభ మయ్యే రోజున విద్యార్థులందరూ తప్పనిసరిగా హాజరు కావాలని మండల విద్యాధికారి వైరాగడే శివచరణ్ కుమార్ పిలుపునిచ్చారు. వాంకిడి మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు శుక్రవారం ప్రారంభం కానున్న నేపథ్యంలో ఆయన మాట్లాడారు. పాఠశాలల్లో వంద శాతం హాజరు నమోదయ్యేలా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, బడికి క్రమం తప్పకుండా రాని విద్యార్థులు, వారి తల్లిదండ్రు లను ఉపాధ్యాయులు నేరుగా కలిసి నిరంతరం పాఠశా లకు పంపేలా అవగాహన కల్పించాలని స్పష్టం చేశారు. గ్రామాల్లోని వాట్సాప్ గ్రూపుల ద్వారా ప్రచారం చేపట్ట డంతో పాటు సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, స్వయం సహాయక సంఘాల మహిళలు, యువతను భాగ స్వామ్యం చేయాలని సూచించారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సమ న్వయంతో కృషి చేయాలని కోరారు.

# నేడు మోగడ్ దగడ్‌లో ఉచిత నేత్ర వైద్య శిబిరం



**ప్రజాపక్షం / కౌటాల:** మోగడ్ దగడ్ గ్రామపంచా యతీ కార్యాలయంలో శుక్ర వారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు సర్పంచ్ ఎర్మ సుమన్ బాయి తెలిపారు. కాగజ్‌నగర్ ఐకేర్ విజన్ సెంటర్ సహకారంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేస్తు న్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఉదయం 8:30 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నిపుణులైన వైద్యులు కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులను ఉచితంగా అందజేస్తారని వివరిం చారు. దృష్టి లోపాలు, ఇతర తీవ్ర సమస్యలు ఉన్నవారికి ఉచిత కంటి ఆపరేషన్లు చేయించడంతో పాటు, రాయితీపై కళ్లద్దాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కంటి సమస్య లతో బాధపడుతున్న గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# కనర్గాం వాగుపై తాత్కాలిక వంతెన ఏర్పాటు

**ప్రజాపక్షం/వాంకిడి:** వాంకిడి మండలంలోని వాంకిడి–కాగజ్ నగర్ ప్రధాన మార్గంలో గల కనర్గాం, తట్టుగూడ వాగుపై తాత్కా లిక వంతెనను ఏర్పాటు చేశారు. ఏటా వర్షాకాలంలో వాగు ఉధృ తంగా ప్రవహించి రాకపోకలు నిలిచిపోతుండటంతో వాహనదా రులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం రూ.8.5 కోట్లతో శాశ్వత వంతెన నిర్మాణాన్ని మం జూరు చేయగా, సంబంధిత కాంట్రాక్టర్ పనులు ప్రారంభించారు. పనులు జరుగుతున్న సమయంలో ప్రయాణికులకు ఆటంకం కల గకుండా ఉండేందుకు తాత్కాలిక వంతెనను నిర్మించారు. దీంతో గురువారం నుంచి ఈ మార్గంలో రాకపోకలు తిరిగి ప్రారంభం కావడంతో ప్రజలకు ఊరట లభించింది. శాశ్వత వంతెన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

# వంశీధర్ రావుకు మాతృవియోగం

**ప్రజాపక్షం / కాసిపేట:** ధర్మారావుపేట మాజీ సింగిల్ విండో చైర్మన్ పుస్కురి వంశీధర్ రావు మాతృమూర్తి పుస్కురి రేఖారాణి (66) మంగళవారం తుదిశ్వాస విడిచారు. అనారోగ్య సమస్య లతో కరీంనగర్‌లోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆమె మృతి చెందారు. రేఖారాణి మృతి విషయం తెలుసుకున్న నాయకులు ధర్మారావుపేటలోని వారి స్వగృహానికి చేరుకుని ఆమె పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనం తరం కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూ తిని తెలియజేశారు. నివాళులర్పించిన వారిలో బెల్లంపల్లి శాసనస భ్యులు గడ్డం వినోద్, మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రేణుకుంట్ల ప్రవీణ్, బిఆర్‌ఎస్ నాయకులు బోడ జనార్దన్ ఉన్నారు.

# సర్పంచ్ బాపూజీకి ఘన సన్మానం

**ప్రజాపక్షం / వాంకిడి:** గ్రామ ప్రజలంతా సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని సరండి సర్పంచ్ మోహర్లే బాపూజీ ఆకాంక్షించారు. వాంకిడి మండలంలోని సరండి గ్రామంలో గురు వారం శారదా దేవి నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా అమ్మవారి నిమజ్జన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్ర మంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేసిన సర్పంచ్ బాపూజీని, ఉత్స వాలకు సహకారం అందించినందుకు గాను కమిటీ సభ్యులు శాలు వాతో ఘనంగా సత్కరించారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల్లో ఐక్యతను, సోదరభావాన్ని పెంపొందిస్తాయని ఆయన పేర్కొ న్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు భక్తులు పాల్గొన్నారు.

# ఘనంగా కొమురం భీమ్ జయంతి వేడుకలు

**ప్రజాపక్షం / కౌటాల:** ఆదివాసీ వీరుడు కొమురం భీమ్ త్యాగాలు, పోరాట స్ఫూర్తి భావితరాలకు ఆదర్శమని వక్తలు పేర్కొ న్నారు. కౌటాల మండల విద్యావనరుల కేంద్రంలో గురువారం కొమురం భీమ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆదివాసీల హక్కుల పరిరక్షణ కోసం జల్–జంగల్–జమీన్ నినా దంతో కొమురం భీమ్ సాగించిన వీరోచిత పోరాటాన్ని నాయ కులు స్మరించుకున్నారు. ఎంఇఒ జయరాజ్, ప్రధానోపాధ్యా యులు గావుడే హనుమంతు, ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ జిల్లా కోశాధికారి నైతం సాయినాథ్, మండల అధ్యక్షుడు మడావి పోచని, ఉపాధ్యక్షుడు పెందోర్ అశోక్, ఉపాధ్యాయులు మడావి రాములు, శివాజీ, సునీల్, సుమన్ పాల్గొన్నారు.

# ఒక వైపు వర్గపోరు సాగుతుండగానే జగన్ వర్గంలో మరొకరి చేరిక



**ప్రజాపక్షం/మంచిర్యాల టౌన్ :** మంచిర్యాల నియోజకవర్గంలో ఒక వైపు కాంగ్రెస్ పార్టీలో వర్గపోరు, దాడులు, ప్రతి దాడులు నడుస్తుంటే మరో వైపు ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు వర్గీయుడు జగన్‌మోహన్ రావు వర్గంలో గురువారం చేరడం చర్చకు తావిచ్చినట్లయింది. వివరాల్లోకి వెళితే.. కాంగ్రెస్ పార్టీ ఆర్టివి సభ్యుడు అంకతి శ్రీని వాస్ జగన్‌మోహన్‌రావు వర్గంలోకి చేరి ఆయను కలవడం దీనికి తోడు రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి మంచిర్యా లలో అన్ని రకాల సహకా సహకారాలు అందిస్తామని జగన్‌మో హన్‌రావుతో కలిసి పని చేస్తు మంచిర్యాలలో మరోసారి కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని ఈ సందర్భంగా తెలిపారు.

# ఘనంగా పండుగ సాయన్న జయంతి



**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో పండుగ సాయన్న ముదిరాజ్ జయంతి కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పండుగ సాయన్న ముదిరాజ్ చిత్రపటానికి హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాస్, రాష్ట్ర మేర కార్పొరేషన్ చైర్మన్ వెంకట్రాజం, ముదిరాజ్ మహాసభ ప్రధాన కార్యదర్శి అశోక్, ముదిరాజ్ సంఘం నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పండుగ సాయన్న ధైర్య సాహసాలు, చేసిన సేవలను అధికారులు ముదిరాజ్ సంఘం ప్రతినిధులు గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ సంపూర్ణ, ఇతర అధికారులతో పాటు వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# సుస్థిర పంటలు పండించాలి

## మండల వ్యవసాయ అధికారి నెలవంక

**ప్రజాపక్షం/ అల్లాదుర్గం:** మండల కేంద్రంలో గల రైతు వేదిక కార్యాలయంలో గురువారం వ్యవసాయ అధికారి నెలవంక ఆధ్వర్యంలో ఖేత్ బచావో అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేల పరీక్షల ఆధారంగా ఎరువుల వినియోగం, సమతుల్య ఎరువుల యాజమాన్యం, ప్రకృతి వ్యవసాయం, పంట అవశేషాల నిర్వహణ, పంటల వైవిధ్యీకరణ, నీటి సంరక్షణ మరియు సుస్థిర వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు.రైతులు నేల ఆరోగ్యాన్ని కాపాడుతూ, నీటి వనరులను పొదుపుగా వినియోగించుకోవాలని, ప్రాంతానికి అనుకూలమైన పప్పుధాన్యాలు, నూనెగింజల పంటలను ప్రోత్సహించాలని సూచించారు. వ్యవసాయ ఖర్చులను తగ్గించి, లాభదాయకమైన సాగు పద్ధతులను అవలంబించాలని రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి నవీన్ కుమార్, ఆత్మ కమిటీ సిబ్బంది కిరణ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# సారయ్య మృతి పట్ల ఎమ్మెల్యే సంతాపం

**ప్రజాపక్షం/వరంగల్ టౌన్ :** మాజీ కార్పొరేటర్ తూర్పాటి సులోచన భర్త, సీనియర్ జడ్పీటీసీ సభ్యులు సారయ్య మృతి చెందడం పట్ల వర్ధన్నపేట నియోజకవర్గ శాసనసభ్యులు, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సారయ్య మరణం పట్ల ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. సారయ్య మృతి వార్త తెలుసుకున్న ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు వారి నివాసానికి వెళ్లి పార్థివదేహంపై పుష్పగుచ్ఛం ఉంచి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ సారయ్య మృతి బాధాకరమని, వారి కుటుంబానికి ఇది తీరని లోటని పేర్కొన్నా రు. ఈ కష్ట సమయంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని, వారికి మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు. సారయ్య ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.ఈ సందర్భంగా సారయ్య కుటుంబానికి లక్ష రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ డీసీసీ అధ్యక్షులు మహమ్మద్ అయూబ్, 14 వ డివిజన్ అధ్యక్షులు సయ్యద్ ఇంతియాజ్, డివిజన్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# యాసంగిలో వరి సాగు వద్దు.. ప్రత్యామ్నాయ పంటలే ముద్దు

## ఎల్‌నినో ముప్పు.. పడిపోనున్న ప్రాజెక్టులు చెరువుల నీటి నిల్వలు

## రైతులు ఆగం కావద్దు.. అధికారుల సూచనలు పాటించండి

## నీటి పారుదల శాఖ డిఇఇ చింతాడ కిరణ్

**ప్రజాపక్షం/గూడూరుః** రానున్న యాసంగి(రబీ) సిజన్‌లో వాతావరణ పరిస్థితులు సాగునీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని అన్నదాతలు ఎట్టి పరిస్థితుల్లోనూ వరి నాట్లు వేయవద్దని గూడూరు నీటిపారుదల ఉపవిభాగం నం.2 ఉప కార్యనిర్వహక ఇంజనీరు చింతాడ కిరణ్ రైతులకు విజ్ఞప్తి చేశారు. గురువారం గూడూరు మండలంలోని రైతాంగాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ కాబోయే రోజుల్లో ఎల్‌నినో ప్రభావం వల్ల వర్షపాతం గణనీయంగా పడిపోయే అవకాశాలు ఉన్నాయని అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే ప్రమాదం పొంచి ఉందని హెచ్చరించారు.ఈ వాతావరణ మార్పుల కారణంగా ప్రధాన ప్రాజెక్టులు చెరువులు కుంటల్లో నీటి నిల్వలు ఊహించిన దానికంటే వేగంగా అడుగంటే ప్రమాదం ఉందని అంతేకాకుండా భూగర్భజలాలు కూడా పాతాళానికి పడిపోయే పరిస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు.రైతులు నీటి లభ్యతను ముందుస్తుగా సరిగ్గా అంచనా వేసుకోకుండా ఉత్సాహంతో వరి సాగు చేపడితే చివరి దశలో పంటకు నీరందక చేతికొచ్చిన పైరు ఎండిపోయి పెట్టుబడులు కో ల్పోయి తీవ్ర ఆర్థిక నష్టాల్లో కురుకుపోయే ప్రమాదం ఉందని ఆయన స్పష్టం చేశారు. రైతుల కష్టం బుగ్గిపాలు కాకూడదనే ఉద్దేశంతోనే ఈ హెచ్చరికలు జారీ చేస్తున్నామని తెలిపారు. కాబట్టి ఇయకట్టు పరిధిలోని రైతులు వ్యవసాయ శాఖ అధికారులు సలహాలు సూచనలు త ప్పనిసరిగా తీసుకోవాలని కోరారు. తక్కువ నీటితో త క్కువ పెట్టుబడితో చేతికందే ఆరుతడి పంటలైన పుప్పుదినుసులు నూనేగింజలు చిరుధాన్యాలు కూరగాయలు వంటి లాభసాటి ప్రత్యామ్నాయ పంటల సాగువైపు మొ గ్గు చూపాలని సూచించారు. విపత్కర వాతావరణ పరిస్థితులను గ్రహించి వ్యవసాయ నీటిపారుదల శాఖలు ఇచ్చే శాస్త్రీయ మార్గదర్శకాలను తూచా తప్పకుండా పా టించి రైతు కుంటుంబాలు తీవ్ర నష్టాల బారిన పడకుం డా జాగ్రత్త పడాలని చింతాడ కిరణ్ రైతు సోదరులను కోరారు.

# గూడూరులో ఘనంగా కొమురం భీమ్ జయంతి వేడుకలు



**ప్రజాపక్షం/గూడూరుః** మహబూబాబాద్ జిల్లా గూడూరు మండల కేంద్రంలో గురువారం ఆదివాసీ ఉద్యోగులు ఉపాధ్యాయులు యువకులు ఆధ్వర్యంలో ఆదివాసీ పోరాట యోధుడు గోండు బొబ్బిలి కొమురం భీమ్ 125 వ జయంతి వేడకలను అత్యంత ఘనంగా నిర్వహించారు.స్థానిక కొమురం భీమ్ విగ్రహానికి పూలమాలలు వేసి నాయకులు ఉద్యోగులు ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ 1901 అక్టోబర్ 22 న జన్మించిన కొమురం భీమ్ జల్ జింగిల్ జమీన్ నినాదంతో గిరిజనుల హక్కుల కోసం నిజాం నిరంకుశ పాలనపై తుదిశ్వాస వరకు వీరొచితంగా పోరాడారని కొనియాడారు. ఆదివాసీల ఆత్మగౌరవం హక్కుల రక్షణ కోసం ప్రాణాలర్పించిన అమరవీరుడు కొమురం భీమ్ ఆశయాలను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ ఉద్యోగులు అయిలబోయిన వీరయ్య, బత్తుల శ్రీనువాస్, వెంకన్న, పడిగే రమేష్, రేగ రమేష్, సత్యం, రేగ సాంబయ్య, లింగాల లక్ష్మీ నారాయణ, తుడుందెబ్బ నాయకులు అర్రేం వీరస్వామి, దారం మహేందర్, చంద్రయ్య దోరలతో పాటు యువకులు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్‌పిని కలిసిన టిజెఎ నూతన కమిటీ



**ప్రజాపక్షం/ములుగుః** తెలంగాణ జర్నలిస్టు అసోసియేషన్(టిజేఏ) ములుగు జిల్లా నూతన కమిటీ సభ్యులు గురువారం జిల్లా ఎస్‌పి కేకాన్ సుధీర్ రామ్‌నాథ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్‌పి కమిటీ సభ్యులకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జర్నలిస్టుల సమస్యలు, మీడియా భద్రత, సమాచార లభ్యత తదితర అంశాలపై వారితో చర్చించారు. సమాజంలో వాస్తవాలను నిర్భయంగా ప్రజలకు చేరవేయడంలో జర్నలిస్టుల పాత్ర కీలకమని ఎస్‌పి పేర్కొన్నారు. చట్ట పరిధిలో విధులు నిర్వర్తించే జర్నలిస్టుకు పోలీసు శాఖ ఎల్లప్పుడూ సహకరిస్తుందని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి మీడియా, పోలీస్‌శాఖ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. జర్నలిస్టులకు ఏదైనా సమస్య ఎదురైతే తన దృష్టికి తీసుకురావాలని, పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా టీజేఏ నూతన కమిటీ సభ్యులు ఎస్‌పికి కృతజ్ఞతలు తెలిపారు. ఎస్‌పిని కలిసిన వారిలో టిజేఏ ములుగు జిల్లా అధ్యక్షుడు బేతి సతీష్ యాదవ్, ప్రధాన కార్యదర్శి ఎనగందుల కొమురయ్య, ఉపాధ్యక్షుడు రాజు, కోశాధికారి సంగ రంజిత్ కుమార్, సభ్యులు బిక్షపతి, తదితరులు ఉన్నారు.

# ఆదివాసీల హక్కుల కోసం పోరాడిన యోధుడు కొమురం భీమ్




**ప్రజాపక్షం/చిట్యాలః** ఆదివాసీల హక్కుల కోసం అలుపెరగని పోరాటం చేసిన ధైర్యశాలి కొమురం భీం అని అంబేద్కర్ ఫెలోషిప్ జాతీయ అవార్డు గ్రహీత, ఏవైఎస్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ పుల్ల మల్లయ్య అన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండల కేంద్రంలో అంబేద్కర్ యువజన సంఘం మండలాధ్యక్షుడు జన్నె యుగేందర్ ఆధ్వర్యంలో కొమురం భీం జయంతి వేడుకలు నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలామలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పుల్ల మల్లయ్య, జన్నె యుగేందర్, కొలిపాక సాంబయ్యలు మాట్లాడుతూ ఆదివాసీలకు నీరు, అడవి, భూమిపై హక్కులు కల్పించాలనే లక్ష్యంతో కొమురం భీం నాటి నిజాం పాలకులపై వీరోచిత పోరాటం చేశారని తెలిపారు. జల్..జంగల్..జమీన్ నినాదంతో స్వయం పాలన కోసం పోరాడి అమరుడయ్యాడని పేర్కొన్నారు. నిరంకుశత్వానికి వ్యతిరేకంగా, స్వేచ్ఛ, సమానత్వం, సామాజిక న్యాయం, మహిళల ఆత్మగౌరవం కోసం ఆయన చేసిన పోరాటం చిరస్మరణీయమన్నారు. కొమురం భీం ఆశయాలను ఆదివాసీలు స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం జిల్లా ప్రచార కార్యదర్శి రాజేందర్, చిట్యాల మండల సీనియర్ నాయకులు గురుకుంట్ల కిరణ్, గడ్డం సదానందం, రేగొండ మండల నాయకులు కొలిపాక సాంబయ్య, తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యేతో మర్యాదపూర్వక భేటీ



**ప్రజాపక్షం/గూడూరుః** మహబూబాబాద్ నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ మురళి నాయక్ గూడూరు గ్రామపంచాయతీ సర్పంచ్ వాంకుడొత్ సునీత కొమ్మాలు నాయక్ నివాసానికి మర్యాదపూర్వకంగా విచ్చేశారు, ఈ సందర్భంగా ఎమ్మెల్యేకి సర్పంచ్ కుటుంబ సభ్యులు స్థానిక కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు అనంతరం ఎమ్మెల్యేను శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ భేటీలో భాగంగా గూడూరు గ్రామపంచాయతీ పరిధిలోని పలు సమస్యలు చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై ఎమ్మెల్యేతో సర్పంచ్ చర్చించారు. గ్రామాభివృద్ధికి తమ వంతు సహకారం ఎల్లవేళలా ఉంటుందని ఎమ్మెల్యే మురళి నాయక్ హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా మండల పార్టీ నాయకులు బీరం శ్రీపాల్‌రెడ్డి ఎండి రసూల్ సాంబయ్య సోమన్న రాంబాబు తదితరులు పాల్గోన్నారు.

# అర్హులైన ప్రతి గ్రాడ్యుయేట్ ఓటరుగా నమోదు కావాలి



**ప్రజాపక్షం/భూపాలపల్లిః** త్వరలో జరగనున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఓటరు నమోదు ప్రక్రియను ప్రతిష్టాత్మకంగా తీసుకొని, అర్హులైన ప్రతి గ్రాడ్యుయేట్ ఓటరుగా నమోదు అయ్యేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి సూచించారు. గురువారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు ప్రక్రియపై నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రతి ఒక్కరూ ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని సూచించారు. తమ పరిధిలోని అర్హులైన ప్రతి గ్రాడ్యుయేట్‌ను వ్యక్తిగతంగా కలిసి ఓటరు నమోదు ప్రాముఖ్యతను వివరించాలని తెలిపారు. ఓటు హక్కుకు అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ తమ పేరును ఓటరు జాబితాలో నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో బిఆర్ఎస్ నాయకులు కటకం జనార్ధన్, సెగ్గం సిద్దు, మందల రవీందర్ రెడ్డి, దార పూలమ్మ, మాదాసి తిరుపతమ్మ స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# ప్రజల గొంతుకగా 'ప్రజాపక్షం' నిలవాలి

## టిజిఎస్ రాష్ట కార్యదర్శి రాజేష్ ఖన్నా

**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** ప్రజ సమస్యలు రాజకీయ సామాజిక అంశాలపై సమగ్ర వార్తా కథనాలను అందిస్తూ పాఠకుల ఆదరణ పొందుతున్న ప్రజాపక్షం దినపత్రిక 8వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ గంగపుత్ర సంఘం రాష్ట్ర కార్యదర్శి టుంగుటూరి రాజేష్ ఖన్నా గంగపుత్ర పత్రిక యాజమాన్యానికి సంపాదకవర్గానికి పాత్రికేయులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకురావడంతో పాటు, సమాజంలోని వివిధ వర్గాల అభిప్రాయాలను ప్రజలకు చేరవేయడంలో ప్రజాపక్షం దినపత్రిక చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. పత్రిక యాజమాన్యం సంపాదకులు, పాత్రికేయులు, సిబ్బంది అందరికీ 8వ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ ప్రజల పక్షాన మరింత బాధ్యతాయుతమైన జర్నలిజంతో ప్రజాపక్షం దినపత్రిక ముందుకు సాగాలని రాజేష్ ఖన్నా ఆకాంక్షించారు.